


భూస బుసలు



ఎక్కడ చూసినా భూ వివాదాలే

భూములకు సంబంధించి సమస్యలతో గ్రామీణులు సతమతమవుతుంటే.. అగ్నికి ఆజ్యం పోసినట్లు క్షేత్రస్థాయిలో రెవెన్యూ సిబ్బంది మరిన్ని సమస్యలు సృష్టిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన రీసర్వేతో కొత్త వివాదాలు పుట్టుకొచ్చాయి. దీంతో రైతులు మండల, డివిజన్ స్థాయిలో పరిష్కారం కాక కలెక్టరేట్‌కు పరుగులు పెడుతున్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదికలో సింహభాగం భూసమస్యలే ఉంటున్నాయి. గత డిసెంబరులో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లోనూ భూసమస్యలే అధికంగా ఉన్నాయి. వాటి పరిష్కారంపై రెవెన్యూ అధికారులు దృష్టి సారించలేదని బాధితులు వాపోతున్నారు.

- ఆజ్యం పోస్తున్న రెవెన్యూ సిబ్బంది
- జిల్లాస్థాయి దాటి రాజధాని దాకా..
- పరిష్కారం కోసం బాధితుల ప్రదక్షిణ

పుట్టపర్తి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూసమస్యలు భారీగా పుట్టుకొస్తున్నాయి. ఇటీవల జిల్లా స్థాయిలో కలెక్టర్, ఎస్పీ ప్రజా సమస్యల పరిష్కార వేదిక మొదలుకుని ఆర్డీఓ, తహసీల్దార్, పోలీస్‌స్టేషన్ వరకు భూసమస్యల ఫిర్యాదిదారులతోనే కనిపిస్తున్నాయి. భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎన్ని సదస్సులు నిర్వహిస్తున్నా మళ్లీ అవే వస్తున్నాయి. చివరకు కలెక్టరేట్, రెవెన్యూ కార్యాలయాల వద్ద బాధితులు ఆత్మహత్యాయత్నాలకు పాల్పడుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. భూరికార్డుల్లో తప్పిదాలతోపాటు రెవెన్యూ శాఖ క్షేత్రస్థాయి సిబ్బంది లీలలతో ఈ సమస్యలు పెరిగిపోతున్నాయి. రెవెన్యూ రికార్డులను సరిదిద్దుతామని జిల్లా యంత్రాంగం చెబుతున్న మాటలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. వ్యవసాయ భూముల సరిహద్దులు మొదలు దారి సమస్యలదాకా పెరిగిపోతున్నాయి. ఇటీవల మండల, జిల్లా స్థాయిదాటి రాజధాని అమరావతి దాకా భూసమస్యల ఫిర్యాదులు వెళుతున్నాయి.

బుసలు కొడుతున్న భూసమస్యలు

జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధితోపాటు రహదారుల విస్తరణ, హంద్రీనీవా పథకం ద్వారా చెరువులకు కృష్ణా జలాల రాక, కొత్త జిల్లా ఏర్పాటుతో ఏ మారుమూల గ్రామానికి వెళ్లినా భూ సమస్యలు బుసలు కొడుతున్నాయి. ఉమ్మడి ఆస్తులు, పూర్వీకుల ఆస్తి భాగపరిష్కారం సరిగ్గా ఉండక పోవడం, డబుల్ అగ్రిమెంట్లు, భూహద్దులు, రోడ్లు, రెడ్‌మార్కులు, అసైన్డ్ స్థలాలు, భూములు అన్యాక్రాంతం, నకిలీ పత్రాలు, సాగులో ఒకరు రికార్డుల్లో మరొకరు వంటివాటితో భూ సమస్యలు పెరిగిపోతున్నాయి. రిజిస్ట్రేషన్, రెవెన్యూ శాఖల మధ్య రికార్డుల పరంగా భూ అనుసంధానం సరిగ్గా లేకపోవడంతోనే సమస్యలకు దారితీస్తున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తాజాగా గత ప్రభుత్వంలో చేపట్టిన భూముల సర్వేతో కొత్త సమస్యలు పుట్టుకొచ్చినట్లు తెలుస్తోంది. వీటిపై గత డిసెంబరులో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వెల్లువలా ఫిర్యాదులు వచ్చాయి. ఈ తప్పులను సరిదిద్దేందుకు మళ్లీ రీసర్వే చేపట్టారు.

రికార్డుల్లో మాయ

జిల్లాలో కొన్నేళ్లుగా చెరువులు, కొండ పోరంబోకు భూములు ఎక్కడున్నా అయిన వారికి రాసిచ్చేస్తున్నారు. రికార్డులు మాయ చేసి అనుకూలంగా మలుచుకుంటున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో భూఆక్రమణలు, నకిలీ పత్రాలతో అక్రమ రిజిస్ట్రేషన్లు యథేచ్ఛగా జరిగాయి. అధికారులు అక్రమార్కులతో చేతులు కలపడంతో మరిన్ని భూ సమస్యలు వచ్చిపడ్డాయి. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి కొందరు రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూములను ధారాదత్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల రెవెన్యూ అధికారులే భూసమస్య సృష్టించి జిల్లా కార్యాలయాలతోపాటు కోర్టు మెట్లు ఎక్కేలా చేస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. సాగులో ఎవరు ఉన్నారో అన్నది రికార్డులు చూడకుండానే అప్పనంగా ఒకరి భూమిని మరొకరికి రికార్డుల్లో నమోదు చేసి వివాదాలు సృష్టిస్తున్నారు. ఇలాంటి భూ సమస్యలు ఇటీవల భారీగా వెలుగుచూస్తున్నాయి. పట్టా ఒకరిది, సాగులో మరొకరు, పట్టాదారు పాసుపుస్తకాలు ఇంకొకరు అన్నట్లుగా ఇటీవల ఫిర్యాదులు ఎక్కువయ్యాయి.

జిల్లా అంతటా ఫిర్యాదుల వెల్లువ

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక జిల్లా కలెక్టరేట్‌తోపాటు డివిజన్, మండల స్థాయిలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికల్లో భూసమస్యలపై 3,999 ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో రెవెన్యూ సమస్యలే 2,245 ఉన్నాయి. పట్టాదారు పాసుపుస్తకాలు, సర్వే, సాగులో ఒకరు, పట్టా మరొకరి పేరుపై, భూహద్దులు, రోడ్డు సమస్యలు ఉన్నాయి. గత ప్రభుత్వంలో చేపట్టిన భూరక్ష రీసర్వేపై 161 గ్రామాల్లో గత డిసెంబర్ 6నుంచి జనవరి 8 దాకా నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 1955 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో 265 సమస్యలకు పరిష్కారం చూపారు. ప్రభుత్వ అసైన్డ్ భూముల్లో సాగుచేసుకుంటున్న వారు పట్టాలు ఇవ్వాలని 971 మంది అర్జీలు ఇవ్వగా.. 394 సమస్యలను పరిష్కరించారు. ఇక పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల స్థలాల సమస్యలు 508 రాగా 276 పరిష్కారం చూపినట్లు చెబుతున్నారు. భూఆక్రమణపై 342 ఫిర్యాదులు రాగా 198 పరిష్కారం చూపినట్లు అధికార యంత్రాంగం చెబుతోంది. జిల్లా స్థాయిలో రెవెన్యూ యంత్రాగం గట్టిగా హెచ్చరిస్తున్నా.. మండల స్థాయిలో పరిష్కారం చూపకపోవడంతో మళ్లీ జిల్లాకు పరుగులు పెడుతున్నారు. ప్రతి సోమవారం డివిజన్, తహసీల్దార్ కార్యాలయాల్లో నిర్వహించే గ్రీవెన్స్‌డేలో పలుమార్లు ఫిర్యాదులు చేసినా పరిష్కారం కాలేవదంటూ చాలా మంది బాధితులు కలెక్టరేట్‌కు వస్తున్నారు. ప్రతి సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చే ఫిర్యాదుల్లో 80 శాతం భూ సమస్యలే ఉన్నాయి.

పరిష్కరిస్తాం

ప్రజా సమస్యల పరిష్కార వేదికలతోపాటు రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదులను గడువులోగా పరిష్కరిస్తున్నాం. భూసమస్యల ఫిర్యాదులపై ప్రత్యేక చొరవ తీసుకుంటున్నాం.

-సూర్యనారాయణరెడ్డి, డిప్యూటీ కలెక్టర్

సాయి శత జయంతిని ఘనంగా నిర్వహిద్దాం..!

కలెక్టర్ టీఎస్ చేతన్



సమీక్షలో కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న, ఎమ్మెల్యే సింధూర, మాజీ మంత్రి పల్లె

పుట్టపర్తి టౌన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని అధికారులకు కలెక్టర్ టీఎస్ చేతన్ సూచించారు. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, జేసీ అభిషేక్‌కుమార్, ఎస్పీ వి.రత్న, సత్యసాయి సెంట్రల్ ట్రస్టు ప్రతినిధులతో వేడుకల ఏర్పాట్లపై గురువారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. జయంతి వేడుకలలో ఎలాంటి పొరపాట్లు జగరకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. విమానాశ్రయం, ఆర్టీసీ బస్టాండ్, చిత్రావతి సుందరీకరణ పనులను ఇప్పటి నుంచే చేపట్టాలని ఆదేశించారు. మొబైల్ టాయిలెట్స్ రవాణా, తా గునీరు, వైద్య శిబిరాల ఏర్పాటుకు సూచనలు ఇచ్చారు. రోడ్డు మరమ్మతు పనులను ఇప్పటి నుంచే చేపట్టి, ఉత్సవాల నాటి కి పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని అన్నారు. ప్రపంచ నలుమూలల నుంచి పది లక్షల మంది భక్తులు వేడుకలకు హాజరవుతారని అన్నారు. వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. పుట్టపర్తి పట్టణంలో నాణ్యమైన, శుభ్రమైన రోడ్లు ఉండాలని ఎమ్మెల్యే అన్నా రు. చిత్రావతి నది, బుక్కపట్నం చెరువు సుందరీకరణ పనులు చేప ట్టాలని అధికారులను కోరారు. మౌలిక వసతుల గురించి అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందచేయాలని సూచించారు. ధర్మవరం రైల్వేస్టేషన్ నుంచి పుట్టపర్తి ఆర్టీసి వారు ప్రత్యేక బస్సులు నడపాలని సూచించారు. సమీక్షలో డీఆర్వో విజయసారథి, ఆర్డీవో సువర్ణ, అర్అండ్‌బీ ఇంజనీర్ సంజీవయ్య, పంచాయతీ రాజ్ ఎస్‌ఈ మురళి, డీపీఓ సమత పాల్గొన్నారు.

శ్మశాన స్థలం మాది..!

శ్మశాన వాటికల స్థలాల విషయంలో తరచూ వివాదాలు తలెత్తుతున్నాయి. ఖననానికి కేటాయించిన భూములు తమవేనని ఎవరో ఒకరు తెరపైకి వస్తున్నారు. అంత్యక్రియలను అడ్డుకుంటున్నారు. తాజాగా గాండ్లపెంట మండలం తూపల్లి పంచాయతీ వంకపల్లి గ్రామంలో ఇదే సమస్య తలెత్తింది. వంకపల్లికి చెందిన వల్లెపు గంగరాజు మంగళవారం రాత్రి రైలు నుంచి జారి పడి మృతిచెందారు. శ్మశానానికి ప్రభుత్వం కేటాయించిన సర్వే నంబరు 767లో మృతదేహాన్ని ఖననం చేసేందుకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు బుధవారం వెళ్లారు. అదే ఊరికి చెందిన ఓ వర్గంవారు అడ్డుకున్నారు. అది తమ పట్టా భూమి అని, అంత్యక్రియలు చేయొద్దని అభ్యంతరం తెలిపారు. ఈ క్రమంలో వాగ్వాదం జరిగింది. సమాచారం అందుకున్న తహసీల్దార్ బాబురావు, ఇన్‌చార్జి ఎస్‌ఐ వలీబాషా గ్రామానికి వెళ్లారు. శ్మశానవాటికకు ప్రభుత్వం ఆ స్థలాన్ని కేటాయించిందని, అడ్డుకోవద్దని సూచించారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో అంత్యక్రియలు సాఫీగా సాగాయి.

-ఆంధ్రజ్యోతి, గాండ్లపెంట




అంత్యక్రియలను అడ్డుకుంటున్న ఓ వర్గంవారు

ఊరికి జ్వరం



కన్నెత్తి చూడని వైద్యాధికారులు

- కర్ణాటక, అన్నమయ్య జిల్లా ఆర్ఎంపీలే దిక్కు
- పది రోజులుగా పెరుగుతున్న బాధితుల సంఖ్య
- గ్రామంలో అపరిశుభ్రత.. రోడ్లపై మురుగు నీరు
- చెడిపోయిన స్టార్టర్.. పొలాల్లో నీటిని తాగుతున్న జనం



గ్రామంలో చెత్తా చెదారంతో నిండిన మురుగు కాలువ



ఈ చిన్నారి పేరు నిహారిక. ఊరి బడిలో ఒకటో తరగతి చదువుతోంది. జ్వరం కారణంగా వారం నుంచి ఇంటివద్దనే ఉంటోంది. ఆర్ఎంపీల వద్ద చికిత్స చేయిస్తున్నా జ్వరం తగ్గడం లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. బడిలో పది మంది చిన్నారులకు జ్వరం సోకిందని, రోజు రోజుకూ బాధితుల సంఖ్య పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

తనకల్లు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్త కురవపల్లిలో (గొళ్లపల్లి) జ్వరాలు ప్రబలుతున్నాయి. పది రోజులుగా సుమారు 30 మంది మంచం పట్టారు. గ్రామంలో 30మందికి పైగా జ్వరాల బారిన పడినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 17 మంది విద్యార్థులు ఉండగా, వీరిలో ఏకంగా పది మంది చిన్నారులు జ్వరాలబారిన పడ్డారు. గ్రామ సమీపంలో వైద్య సదుపాయం లేదు. దీంతో అన్నమయ్య జిల్లా కందుకూరు, కర్ణాటకలోని చాకివేలుకు వెళ్లి ఆర్ఎంపీల వద్ద చికిత్స చేయించుకుంటున్నారు. వేలాది రూపాయలు ఖర్చు చేసినా జ్వరాలు తగ్గడం లేదని ఊరి జనం వాపోతున్నారు. మల్లిరెడ్డిపల్లి ఏఎన్ఎం గ్రామానికి వచ్చి వెళ్లారని, అయినా ప్రయోజనం కనిపించడం లేదని అన్నారు. వైద్యాధికారులు రాకపోవడంతో తమకు సరైన చికిత్స అందడం లేదని అంటున్నారు.

తాగునీరే సమస్యనా..?

గ్రామంలో తాగునీటి బోరు బావి మోటారు వారం రోజులుగా పనిచేయడం లేదు. స్టార్టర్ చెడిపోవడంతో పొలాలకు వెళ్లి వ్యవసాయ బోరుబావుల నీటిని తెచ్చుకుని తాగుతున్నారు. ఈ కారణంగానే జ్వరాలు ప్రబలు తున్నాయేమో అని గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పైగా గ్రామంలో అపరిశుభ్రత నెలకొంది. కర్ణాటక, అన్నమయ్య జిల్లాకు సరిహద్దులో ఉన్న ఈ ఊరికి తనకల్లు మండలంలోని ఎంపీహెచ్‌ఏ, వైద్యులు రావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయించాలని కోరుతున్నారు.

వారం రోజులుగా..

వారం రోజులుగా జ్వరంలో బాధపడుతున్నాను. అన్నమయ్య జిల్లా కందుకూరు, కర్ణాటకలోని చాకివేలుకు వెళ్లి ఆర్ఎంపీల వద్ద చికిత్స చేయించుకున్నాను. అయినా జ్వరం తగ్గలేదు. మా ఇంట్లో ఐదురుగు జ్వరం బారిన పడ్డాం. తనకల్లు ఆసుపత్రికి వెళ్లినా రక్తపరీక్షలు నిర్వహించలేదు. ఎవరికీ జ్వరాలు తగ్గడంలేదు. ఊరిలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలి.

- ఆదెమ్మ, గొళ్లపల్లి



నడవలేకపోతున్నా..



పది రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాను. ఆసుపత్రుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నా తగ్గడం లేదు. మా ఇంట్లో ఉన్న ఆరుగురం జ్వరం బారిన పడ్డాం. ప్రతి రోజూ కందుకూరు, చాకివేలు.. ఏదో ఒక ఊరికి చికిత్సకోసం వెళ్లాల్సి వస్తోంది. జ్వరం కారణంగా నడవలేని పరిస్థితి ఏర్పడింది. డాక్టర్లు ఎవరూ మా ఊరికి రాలేదు. గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి, పరీక్షలు నిర్వహించాలి. తగిన చికిత్స చేయాలి.

- సుబ్బన్న, గొళ్లపల్లి

వైద్య శిబిరం ఏర్పాటు చేస్తాం..

గొళ్లపల్లిలో జ్వరాలు ప్రబలుతున్న విషయం మా దృష్టికి వచ్చింది. గ్రామానికి ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీఓను పంపించాము. వైద్య శిబిరం ఏర్పాటు చేయించి, బాధితులకు చికిత్స చేస్తాం.

- డాక్టర్ లోకేశ్వర్‌రెడ్డి, వైద్యాధికారి, కొక్కంటి



తిరువీధుల్లో ఖాద్రీశుడు

- ఘనంగా మధ్వనవమి వేడుకలు

కదిరి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం మధ్వనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వామివారు సాయంత్రం హనుమంత వాహనంపై తిరువీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు సరిగ్గా నెల రోజుల ముందు ఈ వేడుక నిర్వహించడం ఆనవాయితీ అని ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. బ్రహ్మోత్సవాలకు ముక్కోటి దేవతలకు ఆహ్వానం పలుకుతూ మధ్వ నవమి వేడుకలను నిర్వహిస్తామని అన్నారు. భక్తులు స్వామివారికి తిరువీధుల్లో కాయ, కర్పూరం సమర్పించారు.

శివుడిని తాకిన సూరీడి వెలుగు



ఓంకారేశ్వరుడిని తాకుతున్న సూర్యకిరణాలు

బత్తలపల్లిలోని లలితా త్రిపురసుందరి దేవి, ఓంకారేశ్వరస్వామి ఆలయంలో ఏడాదికి ఒకమారు సంభవించే అరుదైన దృశ్యం ఆవిష్కృతమైంది. సూర్య కిరణాలు నంది విగ్రహాన్ని స్పృశిస్తూ.. స్వామివారి మూల విరాట్టును గురువారం ఉదయం తాకాయి. ఈ దృశ్యాన్ని చూసేందుకు భక్తులు ఆసక్తిగా తరలివచ్చారు. పరమ శివుడికి అత్యంత ఇష్టమైన మాఘ మాసంలో స్వామివారిని సూర్యకిరణలు తాకడం విశేషమని భక్తులు అన్నారు.

- ఆంధ్రజ్యోతి, బత్తలపల్లి

ఘనంగా చైనీస్ డే వేడుకలు



పాటలు పాడుతున్న చైనా భక్తులు

పుట్టపర్తి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): చైనా నూతన సంవత్సర వేడుకలను ఆ దేశ సత్యసాయి భక్తులు ఆఖరి రోజు గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రశాంతి నిలయంలో చైనా సాంప్రదాయ రీతిలో ప్రత్యేక వేదికను అలంకరించారు. ముఖ్య అతిథిగా సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. చైనా భక్తులు ప్రశాంతి నిలయంలో వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని రత్నాకర్ తెలిపారు. సాయంత్రం సాయికుల్వంతు మందిరంలో భక్తిపాటలు ఆలపించారు. ముగింపు వేడుకల్లో హాంకాంగ్, చైనాకు చెందిన వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్ పోటీలు



మాట్లాడుతున్న రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్ క్రీడా పోటీలు శుక్రవారం నుంచి 9వతేదీ వరకు నీలం సంజీవరెడ్డి పీటీసీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్(మా) అధ్యక్షుడు లక్ష్మీపతిరాజు, కార్యనిర్వాహక కార్యదర్శి సుధాకర్‌బాబు తెలిపారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. 30 ఏళ్ల నుంచి 100 సంవత్సరాల వయసు వరకు మాస్టర్స్ అథ్లెటిక్ పరుగు పోటీలకు అర్హులని తెలిపారు. మహిళలు, పురుషులకు వేర్వేరుగా పరుగు, స్పీడ్‌వాక్ పోటీలు ఉంటాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మాస్టర్స్ అథ్లెటిక్స్ పాల్గొంటారని తెలిపారు. మరిన్ని వివరాలు, పేర్ల నమోదుకు సెల్ నంబరు 9502539888ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో మా జిల్లా ప్రధాన కార్యదర్శి సికిందర్, కార్యదర్శి లోకనాథ్, సభ్యులు ఈశ్వర్‌రెడ్డి, భాస్కర్, రమేష్ పాల్గొన్నారు.

భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

- కలెక్టర్ వినోద్‌కుమార్
- సంత్ సేవాలాల్ మహారాజ్ ఉత్సవాలపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

గుత్తిరూరల్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): భక్తులకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని సేవాఘడ్‌లో సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయంలో స్వామి వారి 286వ జయంతి ఉత్సవాలపై కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈనెల 13 నుంచి 15 వరకు జరిగే జయంతి ఉత్సవాలకు హాజరయ్యే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. తాగునీరు, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. మద్యం విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకోవాన్నారు. వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సమావేశంలో గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులు, డీఎస్పీ శ్రీనివాసులు, తహసీల్దార్లు ఓబులేసు, రమాదేవి, ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్, ఈఓఆర్‌డీ శివాజీరెడ్డి, ట్రస్టు ఉపాధ్యక్షుడు కేశవనాయక్, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ సురేష్, పీఆర్ డీఈ మురళీధర్, ట్రస్టు సభ్యులు వీఆర్వోలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు రూ.50 లక్షల మంజూరు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.50 లక్షలు మంజూరు చేసిందని ఏపీ రాష్ట్ర గిరిజన సహకార సంస్థ డైరెక్టర్ రమేష్ నాయక్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గత వైసీపీ హయాంలో ఉత్సవాలకు ఒక్క పైసా నిధులు ఇవ్వలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్థిక ఇబ్బందులున్నా రూ.50 లక్షలు మంజూరు చేయడంపై సంతోకరమన్నారు. కార్యక్రమంలో రాజేష్ నాయక్, మనోహర్, శ్రీనివాస్ నాయక్, సురేష్ నాయక్, రవి నాయక్, శంకర్ నాయక్ పాల్గొన్నారు.



ఛీత్కారం నుంచి.. సత్కారం దాకా..

నాడు పైసా కోసం అడుక్కున్న మహిళలు.. నేడు సంఘాల్లో రూ.లక్షల్లో పొదుపు

- చిరు వ్యాపారాలు, కూలి పనులతో స్వావలంబన
- కాయకష్టంతో పిల్లల భవిష్యత్తుకు బాటలు
- ఆర్డీటీ సహకారంతో పక్కా గృహాల నిర్మాణం
- ఛీదరించుకున్నవారే ఆశ్చర్యపడేలా అభివృద్ధి

స్ఫూర్తిగా నిలుస్తున్న శ్రీరామ జోగుల కాలనీ మహిళలు



లోను ఇచ్చేది లేదన్నారు

ఒకప్పుడు బ్యాంకు అధికారులు లోను ఇచ్చేది లేదంటూ ఖరాఖండిగా తేల్చిచెప్పారు. కాని ఇప్పుడు బ్యాంకు అధికారులే రుణం ఇస్తామని మా కాలనీ వైపు వస్తున్నారు. ఇదంతా మా సమష్టి కృషితోనే సాధ్య పడింది.

- గీతమ్మ, భీముడు మహిళా సంఘం సభ్యురాలు



సంఘాల్లో ఉన్న పొదుపు డబ్బుపై చర్చిస్తున్న మహిళలు

ఒకప్పుడు రూపాయి కోసం భిక్షమెత్తారు. పొట్ట చేతపట్టుకుని, ఊరూరూ తిరుగుతూ, ఎక్కడబడితే అక్కడే గుడారాలు వేసుకొని జీవన పోరాటం చేశారు. తమ పూర్వీకుల నుంచి ఆనవాయితీగా వచ్చిన భిక్షమెత్తడాన్నే జీవన విధానంగా మార్చుకున్నారు. అయితే సమాజంలో మిగతా వారితో పాటు సమానంగా, గౌరవంగా బతకాలనే ఆలోచన వారి రాతను మార్చింది. రూపాయి అడిగితే ఛీకొట్టిన వారు సైతం ఆ మహిళల విజయాన్ని ఆశ్చర్యంతో చూస్తున్నాయి. పొదుపు సంఘాల ద్వారా జీవన గమనంలో సాధికారత సాధిస్తున్న వారే కంబదూరులో పాత పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న శ్రీరామ జోగుల కాలనీకి చెందిన మహిళలు. అడుక్కుతినే రోజుల నుంచి స్వయం ఉపాధి పొందుతున్న పరిస్థితుల దాకా వారి విజయయాత్ర ఇలా...

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పొట్టకూటి కోసం ఊరూరు తిరుగుతున్న సంచార జాతికి చెందిన కొందరు కంబదూరు శివారులో కొన్నేళ్ల కిందట గుడారాలు వేసుకున్నారు. ప్రతిరోజు ఉదయం పిల్లా పాపలతో కలిసి ఇల్లిల్లూ తిరుగుతూ భిక్షమెత్తేవారు. దొరికిన ఆహారంతో కడుపునింపుకునేవారు. ఈక్రమంలో ఎందరి నుంచో ఛీత్కారాలు ఎదుర్కొన్నారు. తరచూ ఎదురవుతున్న అవమానాలు వారిలో సొంతంగా బతకాలనే ఆలోచనను తట్టి లేపాయి. ప్రభుత్వ సహకారంతో వెలుగు సంఘాలు, ఆర్డీటీ సంఘాలను ఏర్పాటు చేసుకొని అందులో పొదుపు చేసుకుంటూ, రుణాలు పొందుతూ చిన్న చిన్న వ్యాపారాలు చేస్తున్నారు. స్వయంకృషితో ఎదుగుతూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. కాలనీలో సుమారు 550 మంది జనాభా ఉన్నారు. ఇందులో సుమారు 120 మంది దాకా మహిళలు ఉంటారు. 2007 లో భిక్షమెత్తుకుంటూ కంబదూరుకు వచ్చి శివారులో స్థిరపడ్డారు. ఆ ప్రాంతాన్ని ఒక కాలనీగా మార్చేసుకున్నారు. ఇక్కడ సుమారు 10 మహిళా సంఘాలు ఉన్నాయి. ఒక్కో సంఘంలో 10 నుంచి 12 మంది సభ్యులుగా ఉన్నారు. వీరికి బ్యాంకులు సుమారు రూ. 50 లక్షల దాకా రుణం ఇచ్చాయి.



శ్రీరామ జోగుల కాలనీ

సొంత వ్యాపారాలతో...

బ్యాంకుల ద్వారా పొందిన రుణాలతో ఆ మహిళలు సొంతంగా చిన్న చిన్న వ్యాపారాలు ప్రారంభించారు. సబ్బులు, సర్ఫ్, ఫినాయిల్, బిందెలు, పేస్టులు, బ్రష్‌లు, ప్లాస్టిక్ వస్తువులు అమ్ముతూ జీవనం సాగిస్తున్నారు. అలా వచ్చిన సంపాదనతో కొంత మొత్తం పొదుపు చేస్తూ రుణాలు తిరిగి చెల్లిస్తున్నారు. ఆదాయం పెరగడంతో పిల్లలను చదివించడం ప్రారంభించా రు. ఇలా వీరి సంతానంలో ఇప్పుడు ఐదో తరగతి నుంచి డిగ్రీ చదువుతున్న పిల్లలు కూడా ఉన్నారు. అలాగే సుమారు 30 నుంచి 40 మంది దాకా అమ్మాయిలకు పెళ్లిళ్లు కూడా చేశారు.

గుర్తింపు అడిగితే ఛీత్కారం

నిత్యం ఎక్కడో ఒకచోటకు వలస వెళ్తుంటారని, ఇలాంటి బిక్షగాళ్లకు బియ్యం కార్డులు కాని, ఎటువంటి గుర్తింపు కార్డులు కాని ఇచ్చేది లేదంటూ అప్పట్లో రెవెన్యూ అధికారులు వారిని ఛీ కొట్టారు. చివరికీ మహిళలంతా కలిసి 10 రోజుల పాటు కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఇక్కడే బతుక్కుంటామని, ఆసరా ఇవ్వాలని వేడుకున్నారు. మహిళల ఆందోళనకు అధికారులు దిగి వచ్చి, బియ్యం కార్డులను పంపిణీ చేశారు. ఈక్రమంలోనే వారు నలుగురితో పాటు సమాజంలో గౌరవంగా బతకాలనే దృఢ నిశ్చయంతో ముందుకు సాగారు.

రూ.50తో పొదుపు ప్రారంభం

కంబదూరుకు వచ్చిన తర్వాత సంచార జాతి మహిళలంతా మాట్లాడుకుని వెలుగు, ఆర్డీటీ సంస్థల ద్వారా సంఘాలను ఏర్పాటు చేసుకున్నారు. తమ సంఘాలకు రాముడు, సీతమ్మ, భీముడు, ఆంజనేయస్వామి, కృష్ణుడు, సంతోష్, వేదావతి, దివ్యశ్రీ, లక్ష్మీ, భానుమతి పేర్లను పెట్టుకున్నారు. ఒక్కో మహిళ రూ.50తో పొదుపును ప్రారంభించారు. ఇలా కొన్నేళ్ల పాటు పొదుపు చేయగా అది నేటికి రూ. 10 లక్షల దాకా చేరింది. పొదుపు ద్వారా అధికారుల్లో గుర్తింపు తెచ్చుకున్నారు. వెలుగు కార్యాలయంలో 10 మహిళా సంఘాలు, ఆర్డీటీ సంస్థలో 5 మహిళా సంఘాలను ఏర్పాటు చేసుకున్నారు. మరో మూడు కొత్త సంఘాలను ఏర్పాటు చేసుకోవాలనే ఆలోచనలో ఉన్నట్లు ఆ మహిళలు వెల్లడించారు.

సేద్యం పనులకు డిమాండ్

ఈ మహిళల్లో కొందరు చిరు వ్యాపారాలు చేసుకుంటుండగా, మరి కొందరు వ్యవసాయ కూలిపనులకు వెళ్తున్నారు. కష్టపడి పని చేస్తుండటంతో వీరికి డిమాండ్ బాగా పెరిగింది. 70 మంది మహిళలు ఓ గ్రూప్‌గా మారారు. వీరిలో మళ్లీ బ్యాచ్‌లు బ్యాచ్‌లుగా విడిపోయారు. వీరందరికి ఒక గ్రూప్ లీడర్‌గా ఉంటారు. ఎక్కడికి ఏ పనికి వెళ్లాలన్నా అనుమతులు తీసుకునే వెళ్తుంటారు. ఇంతమంది మహిళలు ఒకే చోట పనికి వస్తుండటంతో కూలి పనులకు తీసుకెళ్లడానికి రైతులు ఈ కాలనీ వైపు పరుగులు తీస్తుంటారు. కంబదూరు మండలంలో పాటు కర్ణాటక ప్రాంతాల్లో ఉండే గ్రామాలకు కూడా వీరు కూలి పనులకు వెళ్తుంటారు. ఖాళీ సమయం అనేదే ఈ మహిళలకు ఉండదు. నిత్యం ఎక్కడో ఒక చోటకు కూలి పనులకు వెళ్తుంటారు. అలాగే ఉపాధి హామీ పనులకు కూడా వెళ్తుంటారు.

ఆదుకున్న ఆర్డీటీ

సొంతిళ్లు లేని మహిళలందరూ కలిసి ఆర్డీటీ ప్రతినిధులకు సమస్యను విన్నవించారు. స్పందించిన ఆర్డీటీ వారికి ఒకే సారి 35 పక్కా గృహాలను నిర్మించింది. దీంతో గుడిసెలతో ఉన్న ఆ ప్రాంతం అందమైన కాలనీగా రూపుదిద్దుకుంది. దానికి శ్రీరామ జోగుల కాలనీగా పేరు పెట్టుకున్నారు. కొండ ప్రాంతంలో ఈ కాలనీ ఉండటంతో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. ఇక్కడ ప్రభుత్వ నూతనంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్మించింది. వైద్య సిబ్బంది అక్కడికే వెళ్లి వైద్య సేవలపై అవగాహన కల్పిస్తుంటారు. ఇదంతా తమ ఇంటి మహిళల వల్లే సాధ్యమైందని పలువురు పురుషులు పేర్కొన్నారు.

రూపాయి కోసం భిక్షమెత్తాం



ఒకప్పుడు రూపాయి కోసం భిక్షమెత్తాం. తరచూ ఎదురైన ఛీత్కారాలతో ఆ రూపాయినే పొదుపుగా మార్చుకుని, కష్టపడి పని చేసుకుంటూ నలుగురిలో గౌరవంగా బతుకుతున్నాం. భిక్షమెత్తిన రోజుల్లో తిండికి అల్లాడిన మేము మా సంపాదనతో ఇప్పుడు ఇంటిల్లిపాది మూడు పూటలా తింటున్నాం. ఇదంతా మా సమష్టి కృషే. అధికారులు చేయూతనిస్తే ఇంకా ఆర్థికంగా ఎదుగుతాం.

- జయమ్మ, మహిళా సంఘం అధ్యక్షురాలు

డబ్బుంటేనే గుర్తింపు



నేడు సమాజంలో డబ్బుంటేనే గౌరవం, గుర్తింపు. అందుకే ఆదర్శంగా అందరిలోను నిలవాలనే ఆలోచనతో ముందడుగు వేశాం. పైసా పైసా పొదుపు చేసి దాన్ని లక్షలుగా మార్చి మా బతుకులను మార్చుకున్నాం. ఇంకా ఆదర్శంగా నిలవాలన్నదే మా ప్రయత్నం. ఇదంతా మహిళలందరూ రాత్రింబవళ్లు కష్టపడిన విజయం. ఇదే స్ఫూర్తితో ముందడుగు వేస్తాం. ప్రతి నెలా పొదుపు సూత్రాలు పాటిస్తున్నాం.

-శ్రీదేవి, భీముడు మహిళా సంఘం సభ్యురాలు

భిక్షమడిగితే విసుక్కునేవారు



భిక్షం అడిగితే అందరూ మమ్మల్ని విసుక్కునేవారు. అందుకే అడుక్కోవడాన్ని వదిలేశాం. స్వశక్తితో మేము ఓ కాలనీని ఏర్పాటు చేసుకుని, డబ్బులు సంపాదిస్తూ గౌరవ మర్యాదలు పొందుతున్నాం. సుమారు 70 మందికి పైబడి మా కాలనీలో మహిళలు జీవిస్తున్నారు. మహిళలందరికీ స్వయం ఉపాధి పథకాన్ని ఇక్కడే ఏర్పాటు చేస్తే ఆర్థికంగా ఇంకా రాణించేందుకు అవకాశం ఉంటుంది.

- గంగమ్మ, సీతమ్మ మహిళా సంఘం సభ్యురాలు

రాత్రింబవళ్లు కష్టపడ్డాం



డబ్బు, పేరును సంపాదించడం కోసం రాత్రింబవళ్లు కష్టపడ్డాం. ఆర్డీటీ, ప్రభుత్వ అధికారులు అందరూ కూడా మా కాలనీని ఆదర్శంగా తీసుకోవాలని సమావేశాల్లో చెబుతుండటం మాకు గర్వం కలిగిస్తోంది. అధికారులు మేము కష్టపడుతూ సాధించిన విజయాలను ప్రతి ఒక్కరికి చెబుతుంటారు. ఇప్పుడు ఎక్కడ చూసినా మా కాలనీ గురించి చర్చించుకోవడం ఆనందం కలిగిస్తోంది.

- రామక్క, రాముడు మహిళా సంఘం

పంట నమోదును పూర్తి చేయండి

జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ



మాట్లాడుతున్న ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రబీ ఈ పంట నమోదు, ఈకేవైసీలను త్వరగా పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. గురువారం ఏడీఏలు, ఏఓలతో సమావేశాన్ని నిర్వహించారు. కిసాన్ డ్రోన్‌లకు సంబంధించి కొత్త గ్రూపులను, పైలెట్లను గుర్తించడంతోపాటు శిక్షణ ఇవ్వాలన్నారు. మరో రెండు రోజుల్లో ప్రతి మండలానికి ఒక కిసాన్ డ్రోన్ రైతు గ్రూపును గుర్తించి, వారి వివరాలు పంపాలని ఆదేశించారు. పీఎం కిసాన్‌కు సంబంధించి ఫిర్యాదులను పరిశీలించి, లాగిన్‌లో నమోదు చేయాలన్నారు. రైతు ఆత్మహత్యలకు సంబంధించి గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కమిటీలు పరిశీలించి, త్వరగా ఆన్‌లైన్ ద్వారా జిల్లా స్థాయికి పంపాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏలు రవి, వెంకటరాముడు, యల్లప్ప, లక్ష్మానాయక్, టెక్నికల్ ఏఓలు వెంకట్‌కుమార్, రాకేష్, బాలూ నాయక్ పాల్గొన్నారు.

కోళ్ల మరణాలపై సమాచారం ఇవ్వండి

పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో కోళ్లు అసాధారణంగా మరణిస్తే స్థానిక వెటర్నరీ డాక్టర్లకు వెంటనే సమాచారం అందించాలని పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి, పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ రామచంద్ర గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో కోళ్ల అసాధారణ మరణాలు సంభవించాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జిల్లా అధికారులను అప్రమత్తం చేసిందన్నారు. క్షేత్రస్థాయిలో కోళ్ల పరిస్థితిపై పరిశీలించామని, ఉమ్మడి జిల్లాలో ఎక్కడా అసాధారణ మరణాలు లేవన్నారు. అవసరమైన చోట్ల నమూనాలు సేకరిస్తున్నామన్నారు. ఎక్కడైనా కోళ్లు చనిపోతే గుంత తీసి పూడ్చాలన్నారు.

15న మెగా జాబ్‌మేళా : ఎమ్మెల్యే

మడకశిరటౌన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఈనెల 15న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని మధుగిరి రోడ్డు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఆవరణంలో ఫిబ్రవరి 15 ఉదయం 10 గంటలకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు మెగా జాబ్‌మేళాలో పాల్గొని ఉద్యోగ అవకాశాలు పొందవచ్చన్నారు.

అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య

విడపనకల్లు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఓ యువరైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పాల్తూరు ఎస్‌ఐ మురహరి తెలిపిన వివరాల మేరకు.. విడపనకల్లు మండలం హావళిగి గ్రామానికి చెందిన వన్నూరుస్వామి(28) బుధవారం రాత్రి క్రిమి సంహారక మందు తాగాడు. గమనించిన బంధువులు వెంటనే బళ్లారి విమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. వన్నూరుస్వామికి మూడు ఎకరాలు సొంత పొలం ఉంది. దాంతో పాటు మరో ఆరు ఎకరాలు కౌలుకు చేసేవాడు. పంటల పెట్టుబడుల కోసం సుమారు రూ. 9లక్షలకు పైగా అప్పులు చేశాడు. అప్పులు ఎలా తీర్చుకోవాలని మదన పడుతుండేవాడని బంధువులు తెలిపారు. ఆ బాధతోనే ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పారు. మృతుడికి భార్య సునిత, కొడుకు, కూతురు ఉన్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

గుంతకల్లు మీదుగా రైళ్ల మళ్లింపు

గుంతకల్లు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఖమ్మం రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న నాన్ ఇంటర్లాకింగ్ పనుల కారణంగా నాలుగు రైళ్లను గుంతకల్లు మీదుగా మళ్లించనున్నట్లు రైల్వే శాఖ అధికారులు ప్రకటనలో తెలిపారు. హజ్రత్ నిజాముద్దీన్-కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ (నంబర్ 12642) రైలును ఈ నెల 10, 15, 17 తేదీల్లో విజయవాడ-గూడూరు సెక్షన్ ద్వారా కాకుండా బాలార్షా, ఖాజీపేట్, కాచిగూడ, డోన్, గుంతకల్లు, రేణిగుంట, చెన్నై మీదుగా మళ్లిస్తామని తెలిపారు. హజ్రత్ నిజాముద్దీన్-త్రివేండ్రం ఎక్స్‌ప్రెస్ (నంబర్ 12644) రైలును ఈనెల 14న, హజ్రత్ నిజాముద్దీన్-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ (నంబర్ 12646) రైలును ఈనెల 11, 18 తేదీల్లోనూ, ఇండోర్-త్రివేండ్రం ఎక్స్‌ప్రెస్ (నంబర్ 22645) రైలును ఈనెల 10, 17 తేదీల్లోనూ బాలార్షా, ఖాజీపేట్, కాచిగూడ, డోన్, గుంతకల్లు, రేణిగుంట, చెన్నై మార్గంలో మళ్లిస్తామని తెలిపారు. గుంతకల్లు రైల్వే డివిజన్‌లో జరుగుతున్న నాన్ ఇంటర్లాకింగ్ పనుల కారణంగా షోలాపూర్-తిరుపతి (వయా గుంతకల్లు) వెళ్లే ప్రత్యేక రైలు (నంబర్ 01437)ను ఈ గురువారం (6న) విజయపుర-గదగ్-హోస్పేట-బళ్లారి-గుంతకల్లు మీదుగా మళ్లించారు. ఔరంగాబాద్-తిరుపతి ఎక్స్‌ప్రెస్ (నంబర్ 17621)ను 7వ తేదీ తాండూరు-ఆదోని మీదుగా కాకుండా వికారాబాద్, సికింద్రాబాద్, కాచిగూడ, డోన్, గుంతకల్లు మీదుగా మళ్లిస్తున్నామని తెలియజేశారు. గుంతకల్లు మీదుగా వెళ్లే కన్యాకుమారి-పూనే ఎక్స్‌ప్రెస్‌ను (నంబర్ 16382) ఈ నెల 6, 7, 8 తేదీలలో గంటన్నర ఆలస్యంగా నడుపుతున్నామని తెలిపారు.

పండ్లతోటల రైతులను ఆదుకోండి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్



మాట్లాడుతున్న రాంభూపాల్

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పండ్లతోటల రైతులను ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండ్ చేశారు. గురువారం పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి నల్లప్పతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఉద్యానవన కాంక్లేవ్ ఈ ప్రాంత ఉద్యానవన ఉత్పత్తుల ప్రచారానికి తోడ్పడాన్ని సీపీఎం స్వాగతిస్తోందన్నారు. పండ్లతోటల రైతులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకు కంపెనీల ఒప్పందాలే పరిష్కారమన్నట్లు భావించడం తగదన్నారు. పండ్లతోటల రైతులతో విస్తృతంగా చర్చించి, వారిని ఆదుకోవడానికి సమగ్ర చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో గత 15 సంవత్సరాల్లో వచ్చిన వరుస కరువుల వల్ల మెట్ట వ్యవసాయం తీవ్ర సంక్షోభానికి గురైందని తెలిపారు. సాగునీటి వనరుల అభివృద్ధికి తక్షణ ప్రత్యామ్నాయంగా మైక్రో ఇరిగేషన్ విధానం అమలులోకి వచ్చిందన్నారు. హార్టికల్చర్ కాంక్లేవ్ ద్వారా పండ్లతోటల రైతులను సమగ్రంగా ఆదుకోవడానికి బదులుగా కంపెనీలు, ఒప్పందాల చుట్టూ తిప్పారని అన్నారు. కార్యక్రమం ప్రచారానికే తప్ప రైతుల సమస్యలకు పరిష్కారం చూపలేదని విమర్శించారు. ఇప్పటికైనా ఉద్యాన రైతులను ఆదుకునేందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

9న గిరిజన సమస్యలపై సమావేశం

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 9న ప్రెస్‌క్లబ్‌లో ఉదయం 10గంటలకు అవగాహన సమావేశం నిర్వహించనున్నట్లు గిరిజన ప్రజాసమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జున నాయక్ తెలిపారు. రాష్ట్రంలో పెరిగిన గిరిజన జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు 6 నుంచి 12 శాతానికి పెంచాలని, మైదాన ప్రాంత గిరిజనులకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలన్నారు.

చీనీని పీడిస్తున్న పోలుసు

పురుగు దెబ్బకు రైతు కుదేలు.. కళ్ల ముందే ఎండుతున్న చీనీచెట్లు

ఖరీదైన మందులు వాడినా ఫలితం శూన్యం



వ్యాధిసోకిన చీనీ తోట

తాడిమర్రి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): సులువుగా పండించే పంట ప్రస్తుతం కష్టతరమైపోయింది. రెండు సార్లు పురుగుల మందులు స్ప్రే చేస్తే చేతికి వచ్చే చీనీ పంట.. నేడు 16 సార్లు మందులు కొట్టినా తెగులు అదుపులోకి రాలేదు. దీనికి తోడు ఇటీవల వచ్చిన పోలుసు పురుగు (హైరోకోకస్ సిట్రస్) తెగులు తీవ్రం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పోలుసు పురుగు అధికమై చీనీ చెట్ల బెరడు దెబ్బతిని ఎండిపోతున్నాయి. చీనీ కాయలకు మంగు ఏర్పడడంతో పంటను కాపాడుకోవడానికి రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అనంతపురం జిల్లాలో గార్లదిన్నె మండలం, సత్యసాయి జిల్లాలో తాడిమర్రి మండలంలో అధికంగా చీనీ సాగవుతోంది. తెగుళ్లను అధికారులు కనీసం పరిశీలించిన పాపాన పోలేదు. పోలుసు పురుగు నివారణకు లీటరు రూ. 5వేల నుంచి 8వేల వరకు వెచ్చించి పిచికారి చేసినా ఫలితం లేకుండా పోతోంది. ఈ తెగులు తీవ్రత మండలంలోని శివంపల్లి, తాడిమర్రి, కునుకుంట్ల గ్రామాల్లో అధికంగా ఉంది.

ఇలా మొదలవుతుంది..

పోలుసు తెగులుతో మొదటి దశలో చెట్లకు ఉన్న ఆకులు పసుపు వర్ణానికి మారడం మొదలవుతుంది. తరువాత కాండంపై ఉన్న బెరడు పగిలిపోవడం, చెట్టు నుంచి విపరీతంగా పూత, పిందె రావడంతోపాటు కాండంపై తెల్లటి పురుగు కనిపిస్తుంది. ఆ తరువాత దశలో చెట్టు పూర్తిగా ఎండిపోతుంది. దీనిని అదుపు చేయడానికి రైతులు మొదట కాండాన్ని గోనె సంచితో శుభ్రం చేసిన తరువాత మైలుతుత్తం, సున్నం కలిపి తయారు చేసుకున్న బోర్డో మిశ్రమాన్ని చెట్టు కొమ్మల వరకు పట్టిస్తున్నారు. ఇలా కూడా అదుపులోకి రానప్పుడు ఖరీదైన మందుల వైపు రైతులు పరుగులు పెడుతున్నారు. వయసు ఎక్కువగా ఉన్న చెట్లకే కాకుండా ఇటీవల నాటుకున్న వాటికి కూడా వ్యాప్తి చెందుతుండటంతో దిక్కుతోచని స్థితిలో రైతులు విలవిల లాడుతున్నారు. ఒక చెట్టు చనిపోయిందంటే.. ఏడాదికి సుమారు రూ.5వేలు నష్టం వాటిల్లినట్టే. ఇలా ఒక్కో రైతు పొలంలో కనీసం 40 నుంచి 50 చెట్లు చనిపోయాయి. కునుకుంట్లలో మరీ దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. ఆర్థిక పరిస్థితి సరిగా లేని రైతులు ఈ తెగులుకు మందులు కొనుగోలు చేయలేక బెంబేలెత్తిపోతున్నారు. ఆర్గానిక్ మందులను కూడా తెప్పించుకుని రెండు, మూడు రోజుల పాటు బెల్లంనీటిలో కలిపి చీనీచెట్లకు వదులుతున్నారు. దీనికి తోడు నల్లి ఉధృతి కూడా పెరుగుతోంది. పోలుసుపురుగుకు మందు కొట్టాలో.. నల్లికి కొట్టాలో తెలియక రైతులు గందరగోళంలో పడ్డారు.



చివరి దశ.. కాయలకు సోకిన మంగు

ఎన్ని మందులు వాడినా ఫలితం లేదు



రోజుకొక మందుల కంపెనీ వాళ్లు వస్తారు.. ఆ మందు కొట్టు, ఈ మిశ్రమం పట్టించు, చెట్టు చుట్టూ గాడి తీసి అందులో మందు, నీరు పోయి అని చెబుతున్నారు. ఇవన్నీ కాదని ఆర్గానిక్ మందులు వాడితే మంచి ఫలితం వస్తుందని మరొకరు చెబుతారు. అన్నీ చేసినా చెట్లు పూర్తిస్థాయిలో కోలుకోలేదు. ఇప్పటికి రూ.1.50 లక్షలు అప్పులు చేసి మందులు కొట్టాను. అయినా ఫలితం లేదు.

-చలపతి, రైతు, తాడిమర్రి

అధికారులు దృష్టి సారించాలి



అందరూ వచ్చి పోతున్నారే కానీ అధికారులు మాత్రం రావడంలేదు. వారు తోటలను పరిశీలించి తగిన మందులను సిఫారసు చేస్తే బాగుంటుంది. ప్రభుత్వం కూడా మా పరిస్థితిని అర్థం చేసుకుని తక్కువ ధరలో మందులు పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలి. ఇప్పటికే ఆర్గానిక్ మందులు కూడా వదిలాం. అయినా ఫలితం కనిపించలేదు.

-ప్రభాకర్, రైతు, తాడిమర్రి

బడిలో బోగస్ లెక్కలు..!

- కనిపించని 2,685 మంది విద్యార్థులు
- కమిషనర్ ఆదేశాలతో విచారణ
- జిల్లావ్యాప్తంగా 31 మండలాల్లో ఏరివేత



డీఈఓ కార్యాలయం

అనంతపురం విద్య, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఒకరు, ఇద్దరు కాదు.. వేలాది మంది విద్యార్థులను బడిలో బోగస్‌గా నమోదు చేసినట్లు అధికారులు తేల్చారు. జిల్లావ్యాప్తంగా 2,685 మంది విద్యార్థులు లేకున్నా.. బోగస్‌గా ఎన్‌రోల్ చేసినట్లు గుర్తించారు. 31 మండలాల్లో జల్లెడ పట్టి పిల్లల లెక్క తేల్చారు. డ్రాపౌట్లు, లాంగ్ ఆబ్సెంట్స్ ఇతర కారణాల వల్ల 1648 స్కూళ్లలోలేని పిల్లలను గుర్తించారు. బోగస్ ఎన్‌రోల్‌మెంట్ పిల్లల ఏరివేత ప్రక్రియ ప్రారంభానికి ముందు 1,73,309 మంది విద్యార్థులు ఉండేవారు. ఏరివేత తర్వాత ఆ సంఖ్య 1,70,624కి చేరింది. దీంతో జిల్లాలో 2,685 మంది రికార్డులో ఉన్నా... స్కూళ్లలో కనిపించడం లేదు. దీంతో బోగస్ పిల్లలుగా గుర్తించి, ఆన్‌లైన్‌లో సైతం వారి వివరాలు తొలగించినట్లు తెలుస్తోంది.

కమిషనర్ ఆదేశాలతో..

పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చారు. ఉమ్మడి జిల్లాల అధికారులతో ఆయన జీవో 117పై వర్క్‌షాప్‌లో మాట్లాడుతూ.. స్కూళ్లలో బోగస్ రోల్‌ను ప్రస్తావించారు. ఆన్‌లైన్‌లో ఉన్నదానికి, భౌతికంగా స్కూళ్లలో ఉన్న సంఖ్యకు చాలా తేడా కనిపిస్తోందని, దీనిపై కలెక్టర్లు సైతం విచారణ చేయించాలని ఆదేశించారు. దీంతో ఎంఈఓలు.. ఎంపీడీఓలు, నియోజకవర్గ ప్రత్యేకాధికారులతో కలిసి స్కూళ్లలోని లెక్కలు తేల్చాలంటూ ఆదేశించారు. ఇతర శాఖల అధికారుల నుంచి పెద్దగా స్పందన లేకపోవడంతో ఎంఈఓల స్థాయిలో ఏరివేతకు దిగారు. అలా ఎట్టకేలకు మండలాల వారీగా పిల్లల ఎన్‌రోల్‌మెంట్‌పై ఎంఈఓలు విచారణ చేపట్టారు. మండలాల నుంచి దీర్ఘకాలంగా స్కూళ్లకు గైర్హాజరవుతున్న విద్యార్థులు, డ్రాపౌట్లు, ప్రభుత్వ బడుల్లో అడ్మిషన్లు తీసుకుని ప్రైవేటు స్కూళ్లు, అకాడమీల్లో చదువుతున్న పిల్లల లెక్కలు తీశారు.

బోగస్ ఎన్‌రోల్‌మెంట్ వివరాలివీ..

మండలం	బోగస్ విద్యార్థుల సంఖ్య
అనంతపురం	449
ఆత్మకూరు	73
బెళుగుప్ప	80
బొమ్మనహాళ్	340
బ్రహ్మసముద్రం	37
బుక్కరాయసముద్రం	166
డి హీరేహాళ్	80
గార్లదిన్నె	15
గుత్తి	80
గుమ్మఘట్ట	108
గుంతకల్లు	286
కళ్యాణదుర్గం	79
కంబదూరు	74
కణేకల్లు	110
కూడేరు	77
కుందుర్పి	9
నార్పల	56
పామిడి	52
పెద్దపప్పూరు	14
పెద్దవడుగూరు	31
పుట్లూరు	20
రాప్తాడు	37
రాయదుర్గం	74
శెట్టూరు	35
శింగనమల	17
తాడిపత్రి	46
ఉరవకొండ	35
వజ్రకరూరు	35
విడపనకల్లు	124
యాడికి	37
మొత్తం	2,685

ఆకు రాలిన చోట..



శిశిర సమీరమో..
జలధి సాన్నిధ్యమో..
ఆకులు రాలి..
మోడువారిన నీ..
కొమ్మ రెమ్మలపై
విహంగాలు పూలై
కాశాయి చూశావా..?
రాలిపోయాయని..
విచారించకు..!
విరబూశాయని
విశ్వసించకు..!
ఏదీ శాశ్వతం కాదు..
అనుభవం ఏదైనా..
స్వీకరించు..!
ఇక్కడ అంతే..!
ప్రకృతి వింతే..!

(కూడేరు మండలం శివరాంపేట ఏటి గంగమ్మ వద్ద)

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి

దరఖాస్తు గడువు పొడిగింపు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మద్యం దుకాణాలకు గీత కులస్తులు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 8వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు గడువు ఈనెల 5వతేదీతో ముగిసింది. ఎవరూ దరఖాస్తు చేసుకోకపోవడంతో ఈనెల 8వతేదీ సాయంత్రం 5 గంటల వరకు గడువును ప్రభుత్వం పొడిగించిందని సూపరింటెండెంట్ తెలిపారు. 10వ తేదీన జడ్పీ ఆడిటోరియంలో లాటరీ తీస్తామన్నారు. జిల్లాలో 14 మద్యం దుకాణాలను గీత కులస్తులకు కేటాయించామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా

ధర్మవరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని గుట్టకిందపల్లి వద్దగల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సురేశ్ బాబు గురువారం ప్రకటనలో తెలిపారు. 3 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. పది, ఇంటర్, డిప్లొమా, పీజీ పూర్తి చేసి, 18 నుంచి 30 ఏళ్లలోపు వయసు వారు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.15వేల నుంచి రూ.20వేల వరకు జీతం ఉంటుందన్నారు. ఆసక్తిగలవారు బయోడేటాతోపాటు ఆధార్‌కార్డు, విద్యార్హత పత్రాలతో ఉదయం 9గంటలకు కళాశాలలో హాజరు కావాలని ప్రిన్సిపాల్ సూచించారు.

కూటమి ప్రభుత్వమైనా

కరుణించేనా?

ఎంపీఈఓలకు రెన్యువల్ కష్టాలు తీరేనా..?

- ఏటా ఏప్రిల్‌లో జీవో ఇవ్వాలి
- వైసీపీ హయాంలో ప్రతిసారీ ఆలస్యంగా జారీ
- ఈసారైనా సకాలంలో ఇచ్చేరా?
- మినిమమ్ టైం స్కేల్ వర్తింపజేయాలని డిమాండ్



ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంపీఈఓల నేతలు (ఫైల్)

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ ఎంపీఈఓ (మల్టీ పర్పస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్)లకు రెన్యువల్ కష్టాలు ఇప్పటికైనా తీరుతాయో.. లేదోనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఏటా ఏప్రిల్ 1వ తేదీ నుంచి మార్చి నెలాఖరుదాకా రెన్యువల్ జీవో జారీ చేయాల్సి ఉంది. వైసీపీ గత ఐదేళ్ల పాలనలో ఏటా నాలుగు నెలలు ఆలస్యంగా ఎంపీఈఓల రెన్యూవల్ జీవోను ఇస్తూ వచ్చారు. దీంతో ఐదు నెలలు ఆలస్యంగా వేతనాలు అందేవి. ఈ పరిస్థితుల్లో బయట వ్యక్తుల వద్ద అప్పులు చేసి కుటుంబాన్ని పోషించుకోవాల్సిన దుస్థితిని ఎదుర్కొన్నారు. ఈసారైనా రెన్యువల్ జీవో సకాలంలో ఇస్తారో..? లేదోనంటూ ఎంపీఈఓలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సకాలంలో ఇచ్చేరా..?

ఉమ్మడి అనంత జిల్లాలో ప్రస్తుతం 355 మంది ఎంపీఈఓలు పనిచేస్తున్నారు. గత టీడీపీ హయాంలో 2015లో ఎంపీఈఓలను కాంట్రాక్టు ప్రాతిపదికన ఉద్యోగంలోకి తీసుకున్నారు. అప్పట్లో ఏటా సకాలంలో రెన్యువల్ జీవోను జారీ చేసేవారు. వ్యవసాయ శాఖ కమిషనరేట్ ఉన్నతాధికారులు అప్పట్లో సకాలంలో నేరుగా ప్రభుత్వానికి ఎంపీఈఓల రెన్యువల్ ఫైల్ పెట్టి, జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయాలకు పంపేవారు. గత వైసీపీ పాలనలో ఏటా నాలుగు నెలలు ఆలస్యంగా రెన్యువల్ జీవో ఇస్తూ వచ్చారు. దీంతో ప్రతిసారీ ఐదు నెలల వేతనాలు పెండింగ్‌లో పెడుతూ వచ్చారు. ఫలితంగా ఎంపీఈఓలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ఉమ్మడి జిల్లాలోని పలు డివిజన్లలో అదే నెలలో వేతనాల బిల్లులు పెడుతుండగా.. కొన్నిచోట్ల మాత్రం రెండు నుంచి మూడు నెలలు ఆలస్యం చేస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగింపునకు మరో రెండు మాసాల సమయమే ఉంది. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వంలోనైనా రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనరేట్ ఉన్నతాధికారులు మార్చి నెలాఖరులోగా రెన్యువల్ జీవోను జారీ చేస్తారో.. లేదోనని ఎంపీఈఓలు ఆందోళన చెందుతున్నారు.


వైసీపీ సర్కారు నిర్ణయాలతో ఇక్కట్లు

గత టీడీపీ హయాంలో 2015లో జిల్లా సెలెక్షన్ కమిటీ ద్వారా ఉమ్మడి అనంత జిల్లాలో 650 మంది ఎంపీఈఓలను జిల్లా సెలెక్షన్ కమిటీ ద్వారా కాంట్రాక్టు పద్ధతిలో ఎంపిక చేశారు. అప్పట్లో 1000 హెక్టార్లకు ఒక ఎంపీఈఓను నియమించారు. వీరంతా వ్యవసాయ శాఖ పరిధిలో క్షేత్రస్థాయిలో పనిచేస్తూ వచ్చారు. గత వైసీపీ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. రైతు భరోసా కేంద్రాల్లో కొత్తగా వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్, పశుసంవర్ధక శాఖ తరఫున గ్రామస్థాయి సిబ్బందిని నియమించింది. ఆర్బీకే సిబ్బంది నియామకాలతో ఎంపీఈఓలకు కష్టకాలం మొదలైంది. గతంలో ఉమ్మడి అనంత జిల్లాలో 650 మంది ఎంపీఈఓలు పనిచేసేవారు. వీరిలో 175 మంది వీఏఏ పోస్టులకు ఎంపికయ్యారు. మిగిలిన వారిలో 253 మంది ఎంపీఈఓలను 2021, 2022 సంవత్సరాల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ఓడీపై పంపారు. ఇందులో సగం మంది అక్కడికి వెళ్లలేక ఉద్యోగం మానేశారు. ఎంపీఈఓల సంఘం నాయకులు.. కూటమి ప్రజాప్రతినిధులను కలిసి, పలుమార్లు విన్నవించడంతో ఎట్టకేలకు ఇటీవల తిరిగి చిత్తూరు నుంచి ఉమ్మడి అనంత జిల్లాకు పంపారు. ఉమ్మడి జిల్లాలోని కొందరు అధికారులు తమను చులకనగా చూస్తున్నారంటూ ఎంపీఈఓలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కమిషనరేట్‌లోని కొందరు ఉన్నతాధికారులు తమ సమస్యలు వినేందుకు ఇష్టపడటం లేదని వాపోతున్నారు.

సమాన పనికి... సమాన వేతనం..

అనంతపురం జిల్లాలో 451 రైతు సేవా కేంద్రాలున్నాయి. ఆయా కేంద్రాల్లో 126 మంది గ్రామ వ్యవసాయ, 175 మంది ఉద్యాన, 18 మంది పట్టుపరిశ్రమ సహాయకులు పనిచేస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో 127 మంది గ్రామ వ్యవసాయ, 156 మంది ఉద్యాన, 110 మంది పట్టుపరిశ్రమ శాఖ సహాయకులుగా కొనసాగుతున్నారు. అనంతపురం జిల్లాలో 193 మంది ఎంపీఈఓలు, శ్రీసత్యసాయి జిల్లాలో 162 విధులు నిర్వర్తిస్తున్నారు. రైతు సేవాకేంద్రం సిబ్బంది చేసే పనులే ఎంపీఈఓలు చేస్తున్నారు. ఖరీఫ్, రబీ సీజన్లలో ఈ-పంట నమోదు, రైతులతో ఈకేవైసీ, సబ్సిడీ విత్తన పంపిణీ, పంటల బీమా, పంటనష్టపరిహారం జాబితా తయారీ, మట్టి నమూనాలు, పొలం పిలుస్తోంది కార్యక్రమాల నిర్వహణ, రైతు భరోసా, పీఎం కిసాన్ రిజిస్ట్రేషన్, ఈకేవైసీ, రైతులకు డ్రిప్ పరికరాల కోసం రిజిస్ట్రేషన్, పంట ఉత్పత్తుల కొనుగోలు రిజిస్ట్రేషన్, పంటకోత ప్రయోగాలు, ఎరువులు, పురుగు మందుల పంపిణీ తదితర పనులు చేస్తున్నారు. క్షేత్ర స్థాయిలో పంటల సాగులో పాటించాల్సిన పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. రైతు సేవాకేంద్రం సిబ్బందితో సమానంగా పనులు చేస్తున్నా.. ఎంపీఈఓలకు తక్కువ వేతనం ఇస్తుండటంతో వారు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం రైతు సేవా కేంద్రం సిబ్బందికి నెలకు రూ.34 వేల వేతనం ఇస్తున్నారు. ఎంపీఈఓలకు నెలకు రూ.12వేలతోపాటు ప్రోత్సాహక రుసుం రూ.3వేలు చెల్లిస్తున్నారు. ఎంపీఈఓల పనితీరు బాగుందని వ్యవసాయ అధికారి నిర్ధారించి సర్టిఫికెట్ ఇస్తేనే రూ.3వేలు ప్రోత్సాహక రుసుం అందిస్తారు. లేదంటే ఆ సొమ్ము కూడా రాదు. రైతు సేవాకేంద్రం సిబ్బందితో సమానంగా పనులు చేస్తున్నా వేతనం మాత్రం తక్కువగా ఇస్తున్నారని ఎంపీఈఓలు వాపోతున్నారు. సమాన వేతనం ఇవ్వాలంటూ ఆ సంఘం నాయకులు.. ఉన్నతాధికారులు, ప్రభుత్వాన్ని కోరుతూ వస్తున్నారు. ఈ పరిస్థితుల్లో 2023లో అప్పటి రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ హరికిరణ్.. ఎంపీఈఓలు రైతు భరోసా కేంద్రం సిబ్బంది తరహాలోనే అన్ని రకాల పనులు చేస్తున్నారనీ, వారికి మినిమమ్ టైం స్కేల్ వర్తింపజేసి, సమాన పనికి సమాన వేతనం ఇవ్వొచ్చని ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీకి ప్రతిపాదనలు పంపారు. అక్కడి నుంచి ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు వెళ్లినట్లు సమాచారం. గత వైసీపీ పాలనలో అవి అమలుకు నోచుకోలేదని తెలిసింది. కూటమి ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందన్న ఆశతో ఎంపీఈఓలు ఎదురు చూస్తున్నారు. తాజాగా రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు ఎంపీఈఓల సంఘం నాయకులు.. మినిమమ్ టైం స్కేల్ వర్తింపజేయాలని విన్నవించారు. రెండేళ్ల క్రితం అప్పటి కమిషనర్.. ఎంపీఈఓలకు మినిమమ్ టైం స్కేల్ ఇవ్వాలంటూ ప్రతిపాదించిన విషయాన్ని, ఆ ఫైల్ ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న అంశాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని మంత్రి పయ్యావుల హామీ ఇచ్చారు. అలాగే అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను ఎంపీఈఓలు కలిసి ఇదే అంశంపై వినతి పత్రం అందజేశారు. సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో తమకు కూటమి ప్రభుత్వంలో తప్పనిసరిగా న్యాయం చేకూరుతుందన్న ఆశాభావాన్ని బాధిత ఎంపీఈఓలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సిందే.


మినిమమ్ టైం స్కేల్ వర్తింజేయాలి



రైతు సేవాకేంద్రం సిబ్బందితో సమానంగా ఎంపీఈఓలు పనిచేస్తున్నారు. వారికి నెలకు అన్నిరకాల అలవెన్సులు కలిపి రూ.34వేల వేతనం ఇస్తున్నారు. పదేళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఎంపీఈఓలకు నెలకు రూ.12వేలతోపాటు రూ.3వేలు ప్రోత్సాహక రుసుం చెల్లిస్తున్నారు. మినిమమ్ టైం స్కేల్ వర్తింపజేసి, సమాన పనికి సమాన వేతనం అందించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి.

- రెడ్డిప్రసాద్, ఎంపీఈఓల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

చులకన భావం వీడాలి




కొందరు అధికారులు.. ఎంపీఈఓలను చులకన భావంతో చూస్తున్నారు. కాంట్రాక్టు ఉద్యోగులే కదా..? అన్న ధోరణిలో వ్యవహరిస్తున్నారు. కనీస గౌరవం కూడా ఇవ్వడం లేదు. ఎంపీఈఓలపై వేధింపులు ఆపాలి. శాశ్వత ఉద్యోగులుగా గుర్తించి, ప్రభుత్వం ఆదుకోవాలి.

-తిరుపతయ్య, ఎంపీఈఓల సంఘం జిల్లా కార్యదర్శి

చాలీచాలని జీతంతో కుటుంబ పోషణ భారం

పదేళ్లుగా వ్యవసాయ శాఖలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నాం. చాలీచాలని జీతంలో కుటుంబ పోషణ భారంగా మారుతోంది. గత ప్రభుత్వంలో ఐదు నెలలకోమారు జీతాలు ఇచ్చేవారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి నెలా వేతనం అందేలా చర్యలు తీసుకోవాలి. రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలి.



-భాగ్యలక్ష్మి, ఎంపీఈఓల సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు

19 నుంచి టీసీసీ పరీక్షలు

అనంతపురం విద్య/కొత్తచెరువు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ-2025) పరీక్షలు ఈనెల 19వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల విద్యాధికారులు ప్రసాద్‌బాబు, కిష్టప్ప గురువారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ కోర్సులకు సంబంధించిన లోయర్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలు ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకూ నిర్వహిస్తామన్నారు. ఈనెల 10వ తేదీ నుంచి అభ్యర్థుల హాల్‌టిక్కెట్లు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయనీ, డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

'హెల్మెట్ తప్పక ధరించాలి'

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): వాహనాలు నడిపే సమయంలో ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ సూచించారు. స్థానిక డీటీసీ కార్యాలయంలో రోడ్డు ప్రమాదాల నివారణకు పాటించాల్సిన నియమాలపై వాహనదారులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శివప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ... రోడ్డు భద్రత నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో డీటీసీ వీర్రాజు, ఆర్టీఓ సురేష్‌నాయుడు, ఎంవీఐలు సునీత, ఏఎంవీఐలు రఘునాథ్, ప్రసాద్ పాల్గొన్నారు.

సునామ జకినీమాత ఉత్సవాలు ప్రారంభం

గుత్తి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): గుత్తి ఆర్ఎస్‌లో రోడ్డులో వెలసిన అరెకటికల ఆరాధ్య దైవం శ్రీ సునామ జకినీమాత ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున జకినీ అమ్మవారితోపాటు మల్యామ మాతకు అభిషేకం, హోమం, పూర్ణాహుతి, మహామంగళ హారతి ఇచ్చారు. సాయంత్రం సునామ జకినీ అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక రథంలో కొలువుదీర్చి, స్థానిక సాయిబాబా మందిరం నుంచి అమ్మవారి ఆలయం వరకు ఊరేగించారు. మహిళలు కలశాలతో ముందు కదిలారు. మంగళవాయిద్యాలు, నృత్యాలతో సందడిగా సాగింది. రాత్రి అమ్మవార్లకు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. చిన్నారుల నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మల్కారి ఆలూరు లక్ష్మణ్‌రావు, ధర్మకర్త సురేష్‌రావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు సాయినాథ్, నాయకులు సాయిబాబా, రామచంద్రరావు, బాబురావు, అభిలాష్, వెంకట్‌రావు, ఈశ్వర్‌రావు పాల్గొన్నారు.



కలశాలతో మహిళల ఊరేగింపు

అనారోగ్యంతో తాపీ మేస్త్రీ ఆత్మహత్య



సాకే రంగప్ప (ఫైల్)

కొత్తచెరువు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన తాపీ మేస్త్రీ సాకే రంగప్ప(63) అనారోగ్యంతో మనస్తాపం చెంది బుధవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బుధవారం సాయంత్రం మైలేపల్లి చెరువు కట్ట సమీపాన రంగప్ప.. ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడడాన్ని గమనించిన లోకో పైలెట్ రైల్వేస్టేషన్‌కు సమాచారం అందించాడు. రాత్రి 9గంటల సమయంలో ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. అతడి వద్ద నున్న ఆధార్, సెల్‌ఫోన్‌తో వివరాలు సేకరించారు. కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని, బోరున విలపించారు. మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనారోగ్యంతో విసుగుచెంది రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. హిందూపురం రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని, విచారణ చేపట్టారు. రంగప్పకు భార్య గంగమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు, కుమార్తెకు వివాహాలు అయ్యాయి.



మంత్రి అనగానితో పరిటాల శ్రీరామ్

తుంపర్తి రైతుల సమస్య పరిష్కరించండి

మంత్రి అనగానికి పరిటాల శ్రీరామ్ వినతి

ధర్మవరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుంపర్తి గ్రామ రైతుల భూసమస్యను పరిష్కరించాలని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం విజయవాడలో మంత్రి క్యాంప్ కార్యాలయంలో కలిసి.. సమస్య వివరించారు. ఇళ్ల నిర్మాణాల కోసం 90 మంది రైతుల నుంచి అప్పట్లో 210 ఎకరాలు సేకరించారన్నారు. ఎకరా రూ.2కోట్లు ఉండగా రూ.5లక్షల పరిహారం ఇవ్వగా కొందరు రైతులు తీసుకోగా.. మెజారిటీ రైతులు తీసుకోలేదని వివరించారు. అయినా వారి భూములు తీసుకొని ఒక్క రుపాయి కూడా పరిహారంగా ఇవ్వలేదన్నారు. అడ్డుకోబోయిన రైతులపై కేసులు బనాయించారన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనూ వారికి న్యాయం జరగలేదన్నారు. బాధిత రైతులకు న్యాయం చేస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చామని, దీంతో రైతులు బీజేపీ అభ్యర్థి సత్యకుమార్‌ను గెలిపించారని అన్నారు. సమస్యను పరిష్కరించేలా కృషి చేయాలని కోరారు. వెంటనే స్పందించిన మంత్రి కలెక్టర్ టీఎస్ చేతన్‌కు ఫోన్ చేసి తుంపర్తి గ్రామ రైతులకు న్యాయం జరిగే విధంగా పరిహారం ఎంత ఇవ్వాలన్న దానిపై ఆరాతీశారు. దీనిపై నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు.

దరఖాస్తులు అందజేయండి

ధర్మవరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): బీసీ, ఈబీసీ కార్పొరేషన్ల ద్వారా మంజూరయ్యే సబ్సిడీ రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు ఒరిజినల్ దరఖాస్తుతో పాటు ఒక జిరాక్స్ సెట్‌ను అందచేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. ఈనెల 10వ తేదీ సాయంత్రం ఐదు గంటలోగా తన కార్యాలయంలోని హెచ్-1 రేవతికి అందజేయాలని సూచించారు.

9న కంటి వైద్యశిబిరం

ధర్మవరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రోటరీ క్లబ్, బెంగుళూర్‌కు చెందిన శంకర కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ జయ సింహ, కార్యదర్శి నాగభూషణ గురువారం పేర్కొన్నారు. ఈ వైద్యశిబిరాన్ని స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాలలో నిర్వహిస్తామన్నారు.

ఎక్స్‌ప్రెస్ ఆగని స్టేషన్

- ప్రాభవం కోల్పోయిన తనకల్లు రైల్వే స్టేషన్
- కదిరి, ములకల చెరువుకు వెళుతున్న స్థానికులు
- అర్ధరాత్రిళ్లు దిగితే.. ఇంటికి చేరడానికి ఇబ్బందులు



తనకల్లు, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): ఇప్పుడు మండల కేంద్రంగా ఉన్న తనకల్లు.. ఒకప్పుడు కదిరి తాలూకాలో అతిపెద్ద ఫిర్కా (రెవెన్యూ సబ్ డివిజన్). బ్రిటీష్ వారి హయాంలో తనకల్లులో అన్ని రైళ్లు ఆగేవి. తనకల్లు రైల్వేస్టేషన్ ఆనుకుని బ్రిటీష్‌వారు విశ్రాంతి భవనం, సబ్ కోర్టు, సబ్ జైలును ఏర్పాటు చేశారు. ఒకప్పుడు ఓ వెలుగు వెలిగిన తనకల్లు రైల్వేస్టేషన్‌లో నేడు ఒక్క ఎక్స్‌ప్రెస్ రైలు కూడా ఆగడంలేదు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తిరుపతి, హైదరాబాద్ ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తే.. ఎక్స్‌ప్రెస్ రైలు కోసం కదిరి లేదా అన్నమయ్య జిల్లాలోని ములకల చెరువుకు వెళ్లాల్సి వస్తోంది. ఈ మండల ప్రజలు ప్రతి రోజు వందలాదిమంది రైళ్లలో ప్రయాణిస్తుంటారు. తిరుగు ప్రయాణంలో ఏ అర్ధరాత్రో రైలు దిగితే.. స్వస్థలాలకు చేరుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుంతకల్లు- తిరుపతి, తిరుపతి- గుంతకల్లు ప్యాసింజర్ రైళ్లు మాత్రమే తనకల్లులో ఆగుతున్నాయి. కదిరిదేవరపల్లి- తిరుపతి, నర్సాపూర్-ధర్మవరం, ధర్మవరం-నాగర్‌కోయిల్, ధర్మవరం-నర్సాపూర్, తిరుపతి- సికింద్రాబాద్, సికింద్రాబాద్-తిరుపతి (సెవెన్ హిల్స్) అమరావతి- తిరుపతి (అకోలా), కాచిగూడ -తిరుపతి.. ఏ ఒక్క ఎక్స్‌ప్రెస్ రైలూ తనకల్లులో ఆగడం లేదు. ప్రజలు, నిత్యం ప్రయాణాలు చేసే వారు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన కనిపించడం లేదు. వందలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నా, రైల్వే అధికారులు పట్టించుకోవడం లేదు. రైల్వే అధికారులకు వినతిపత్రాలు ఇవ్వాలని భావించినా.. గుంతకల్లుకు వెళ్లాల్సి వస్తోంది. ప్రతి సోమవారం తనకల్లులో నిర్వహించే సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు ఇచ్చినా అవి బుట్టదాఖలు అవుతున్నాయి. పార్లమెంటు సభ్యులు కూడా ఈ విషయంలో స్పందించకపోవడం విమర్శలకు తావిస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ఎంపీ గోరంట్ల మాధవ్ దృష్టికి సమస్యను తీసుకెళ్లినా స్పందించలేదని ఇక్కడి ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంపీ బీకే పార్థసారథి అయినా స్పందించి, తనకల్లులో రైళ్లు ఆగేలా చూడాలని కోరుతున్నారు.

• తీవ్ర ఇబ్బందులు



తనకల్లులో బ్రిటీష్‌వారి కాలం నుంచి రైల్వేస్టేషన్‌కు ప్రాధాన్యం ఉంది. కానీ ఇప్పుడు ఒక్క ఎక్స్‌ప్రెస్ రైలు కూడా ఆగడంలేదు. రైలు ఎక్కాలంటే ములకలచెరువు, కదిరికి వెళ్లాల్సి వస్తోంది. ఈ మండలంలోని విద్యార్థులు వందలాది మంది దూర ప్రాంతాలలో చదువుకుంటున్నారు. వారితోపాటు తల్లిదండ్రులు క్రమం తప్పకుండా ప్రయాణం చేయాల్సి వస్తోంది. ప్రతి రోజూ వందలాది మంది ఎక్స్‌ప్రెస్ రైళ్లలో వెళుతుంటారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తనకల్లులో ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపేలా చూడాలి.

-శివశంకర్, నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, తనకల్లు

• రాత్రిళ్లు ఇబ్బంది..



తనకల్లు రైల్వేస్టేషన్‌లో గతంలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేవి. నేడు ఒక్కటీ ఆగడం లేదు. తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కుటుంబాలతో ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు అర్ధరాత్రి ములకచెరువులతో దిగి, అక్కడి బస్టాండులో పడిగాపులు కాయాల్సి వస్తోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ సమస్యను పరిష్కరించాలి.

-ఆనంద్, వ్యాపారి, తనకల్లు

న్యూస్ బాక్స్



నీటిని విడుదల చేస్తున్న అధికారులు, నాయకులు

సాగు నీటి విడుదల

ముదిగుబ్బ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): యోగి వేమన రిజర్వాయర్ నుంచి కుడి కాలువ ద్వారా 70 క్యూసెక్కుల నీటిని అధికారులు, టీడీపీ నాయకులు గురువారం విడుదల చేశారు. దొరిగల్లు పాత చెరువు, కొడవాండ్లపల్లి, భూదనాంపల్లి, చింతకుంటచెరువుల ద్వారా రైతులకు సాగునీరు అందనున్నట్లు అధికారులు తెలిపారు. సాగునీరు విడుదల చేయడానికి కృషి చేసిన మంత్రి సత్యకుమార్, ధర్మవరం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్‌కు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్‌ఈ విశ్వనాథ్‌రెడ్డి, ఈఈ రాము, జేఈ కృష్ణకుమార్, తెలుగుదేశం పార్టీ నాయకులు కరణం ప్రభాకర్, తుమ్మల మనోహర్, కోట్ల మనోజ్ బాబీ, రిజర్వాయర్ ఛైర్మన్ జయప్రకాష్, వైస్ ఛైర్మన్ శివయ్య పాల్గొన్నారు.

పొలానికి దారి సౌకర్యం కల్పించండి

తనకల్లు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొంతపల్లి గ్రామానికి చెందిన తోపు క్రిష్టప్ప తన పొలానికి దారి సౌకర్యం కల్పించాలని తహసీల్దార్ శోభాసువర్ణమ్మకు గురువారం వినతి పత్రం అందించారు. తాను అనేక సంవత్సరాలుగా భూమిని సాగు చేసుకుంటున్నానని, తన భూమి పక్కన ఉన్న రైతు మొత్తం కంచె వేశారని అన్నారు. ప్రతి పొలానికి దారివ్వాలనే నిబంధన ఉన్నా.. దాన్ని లెక్కచేయకుండా తనను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు వాపోయాడు. ఆయన వెంట ఆ గ్రామస్థులు తోపు క్రిష్టప్ప, చంద్రప్ప, తోపు పారేసు, రమణ ఉన్నారు.

చెట్టు కొమ్మల్లో విద్యుత్ తీగలు



ధర్మవరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక 27వ వార్డులో విద్యుత్ స్తంభాన్ని చెట్టు సమీపంలోనే ఏర్పాటు చేశారు. దీంతో ఆ చెట్టుకొమ్మలు విద్యుత్ తీగలకు తగులుతున్నాయి. ఆ చెట్టు వద్ద చిన్నారులు ఆడుకొంటూ ఉంటారని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆ ప్రాంతవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను పలు మార్లు ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. వారి పట్టించుకో లేదన్నారు. ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

గుంతల రోడ్లకు మోక్షం



గొల్లపల్లి వద్ద గుంతల రోడ్డుపై తారువేస్తున్న సిబ్బంది

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిగిచెర్ల నుంచి ధర్మవరానికి వెళ్లే 12 కిలోమీటర్ల రహదారి పూర్తిగా గుంతలమయమైంది. గత వైసీపీ ప్రభుత్వం రహదారుల నిర్వహణకు నిధులు కేటాయించకపోవడంతో.. రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో గ్రామీణులు ఈ రోడ్లపై ప్రయాణిస్తూ ఇబ్బందులు పడేవారు. కూటమి ప్రభుత్వంలో ఆ రహదారిలో ఉన్న గుంతల రోడ్లకు మరమ్మతులు చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గుంతలను తారు వేసి పూడ్చివేసే పనులు జోరుగా సాగుతున్నాయి.

విద్యార్థులకు పరీక్ష కిట్ల పంపిణీ

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కదిరి ట్రైబ్యూల్ వెల్ఫేర్ బాలికల, బాలుర పాఠశాల, పట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పది విద్యార్థులకు రూ.10 వేల విలువైన పరీక్ష కిట్లను గురువారం అందించారు. ఇందులో ఆర్డీఓ వీవీఎస్ శర్మ, ట్రస్టు సభ్యులు రవినాయక్, పురుషోత్తమనాయక్, ప్రధానోపాధ్యాయులు మురళి, శ్రీనివాస్, వెంకటరమణ, లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కన్నులపండువగా కల్యాణోత్సవం

ధర్మవరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెండేయ స్వామి ఆలయంలో శ్రీభద్రావతి భావనా రుషీంద్రుల కల్యాణ మహోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉదయం 6 గంటలకు గోపూజ, మహాగణపతి పూజ, స్వస్తిపుణ్యాహవాచనం, పంచగవ్య ప్రాశన, ఋత్విగరణం, కార్యకర్తలకు కంకణదారణ, అదిత్యాది నవగ్రహ సహిత కలశస్థాపన, అగ్నిప్రతిష్ట సాయందీక్షా హోమం, మహాగణపతి హోమం, సాయంత్రం ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం ఉదయం భద్రావతి భవనా రుషీంద్రురల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తామని శ్రీపద్మశాలీయ బహుమత్తమ సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు పుత్తారుద్రయ్య, జింకా నాగభూషణ తెలిపారు.



గోపూజ నిర్వహిస్తున్న భక్తులు

రేషన్ బియ్యం కోసం ఆందోళన



ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రేషన్ డిపోల ద్వారా సరఫరా చేస్తున్న బియ్యం తమకు అందలేదని మండలంలోని జంబులవాండ్లపల్లికి చెందిన కార్డుదారులు తహసీల్దార్ కార్యాలయం ముందు గురువారం ఆందోళన చేశారు. రేషన్ షాపులకు ఎప్పుడు వెళ్లినా.. బియ్యం లేవంటున్నారని, గ్రామంలో అనేక మందికి వాటిపైనే ఆధారపడ్డారని వాపోయారు. స్పందించిన తహసీల్దార్ అనంతచారి, సీఎస్ డీటీ విజయనిర్మల మాట్లాడుతూ.. డిసెంబరు కోటా మండలానికి 2,211 కింటాళ్లు వచ్చాయన్నారు. జనవరి కోటా మాత్రం కేవలం 1,811 క్వింటాళ్లు రావడంతో లబ్ధిదారులకు బియ్యం అందలేదన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ఆందోళనలో లబ్ధిదారులు పార్వతమ్మ, లలితమ్మ, అరుణమ్మ, లక్ష్మీనరసమ్మ, సిద్దయ్య, రాధమ్మ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి: ఎమ్మెల్యే

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ పాఠశా లలకు దీటుగా నాణ్యమైన విద్య అందించాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి విద్యా శాఖ అధికారులకు సూచించారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాల యంలో విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని, అందుకు తగిన సహకారం అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, నియోజకవర్గంలో ఎక్కడా విద్యార్థులు డ్రాప్ ఔట్లు ఉండరాదని సూచించారు. ఇందులో మాజీ మంత్రి పల్లెరఘు నాథరెడ్డి, ఆర్డీఓ సువర్ణ, డీఈఓ కిష్టయ్య, ఆరు మండలాలకు సంబంధించిన విద్యాశాఖ అధికారులు గోపాల్‌నాయక్, మోహన్‌బాబు, జయచంద్ర, రెడ్డెప్ప, ప్రసాద్ ఖాదర్‌వలి, రమణ, సురేష్, జిలాన్‌బాషా పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

అడవులను కాపాడుకుందాం



పుట్టపర్తిటౌన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): అడవులకు నిప్పు పెట్టడం మానవాళికి పెను ముప్పుగా మారుతుందని, అడవులను కాపాడుకోవడం అందరి బాధ్యతని జిల్లా అటవీశాఖాధికారి చక్రపాణి పేర్కొన్నారు. అడవులు కాల్చివేత వల్ల కలిగే అన ర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి గురువారం స్థానిక సత్యమ్మ దేవాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు అటవీశాఖ సిబ్బంది, విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్, రూరల్ సీఐ సురేష్, బుక్కపట్నం, పెనుకొండ, కదిరి అటవీక్షేత్ర అధికారులు యామిని సరస్వతి, శ్రీనివాసరెడ్డి, గుర్రప్ప, బుక్కపట్నం ఎస్ఐ క్రిష్ణమూర్తిపాల్గొన్నారు.

మానవహారం ఏర్పాటు చేసిన అధికారులు, విద్యార్థులు

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

వీసీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్



వీసీలో పాల్గొన్న కలెక్టర్, జేసీ

పుట్టపర్తిటౌన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు ప్రజల భాగస్వామ్యంతో పేదరికం లేని రాష్ట్రాన్ని నిర్మించడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ పేర్కొన్నారు. గురువారం రాష్ట్ర సచివాల యం నుంచి సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ టీఎస్ చేతన్, జేసీ అభిషేక్ కుమార్, అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. సీఎస్ మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య అంశంగా అమలు చేస్తున్న పి4 (పబ్లిక్, ప్రైవేటు పీపుల్ పార్ట్నర్ షిప్) ప్రాణాళికపై అన్నిశాఖలాధికారులు దృష్టి సారించాలన్నారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలన పూర్తిస్థాయిలో నిర్మూలించడానికి ఈ పథకాన్ని గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు చేపట్టాలన్నారు. ప్రణాళికలో భాగంగా ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించడానికి ప్రశ్నపత్రం రూపొందించాలన్నారు. ఈనెల 7నుంచి 22వరకు ఈ సర్వేలో జిల్లా ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నారు.



అక్రమ కాలువకు అడ్డు వేస్తున్న అధికారులు, పోలీసులు

నీటి చౌర్యానికి అడ్డుకట్ట

బత్తలపల్లి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): బత్తలపల్లి, నారసింహపల్లి చెరువుకు రెండు రోజుల క్రితం నీటి విడుదల చేశారు. అనంతసాగరం వద్ద ఆవుల ఫాం యజమాని గోపాల్ తన సొంత క్వారీలోకి అక్రమంగా ఆ నీటిని మళ్లించుకున్నాడు. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ డీఈ మహేశ్వరరెడ్డి, ఏఈ భవిత, ఎస్ఐ సోమశేఖర్ గురువారం అనంతసాగరం చేరుకొని జలచౌర్యం జరుగుతున్న ప్రదేశాన్ని పరిశీలించారు. కాలువలో అడ్డుగా వేసిన కంపచెట్లు, రాళ్లను తొలగించి.. అక్రమ కాలువను పూడ్చివేయించారు. నీటిని అక్రమంగా మళ్లించుకొంటున్న గోపాల్‌ను మందలించారు. పోలీస్ స్టేషన్‌కు పిలిపించి 41 నోటీస్ ఇచ్చారు. మరోసారి జలచౌర్యానికి పాల్పడితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. దీంతో గురువారం మధ్యాహ్నం ఆ నీరు పీఏబీఆర్‌కు చేరాయి.

తక్కువ తూకాల సమస్య పరిష్కరించండి

తహసీల్దార్, ఆర్డీఓకు రేషన్ డీలర్ల వినతి



ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న రేషన్ డీలర్లు

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): గోడౌన్ నుంచి రేషన్ బియ్యం తక్కువ తూకాలు వస్తున్నాయని, ఇలా అయితే లబ్ధిదారులకు ఎలా పంపిణీ చేయాలని ధర్మవరం పట్టణం, రూరల్‌కు చెందిన రేషన్ డీలర్లు తహసీల్దార్ నటరాజ, ఆర్డీఓ మహేష్ ఎదుట వాపోయారు. ఈ సమస్యపై తూకాల్లో తేడా అనే శీర్షికతో ఓ కథనాన్ని ఆంధ్రజ్యోతి గురువారం ప్రచురించింది. ఆ కథనాన్ని తహసీల్దార్, ఆర్డీఓకు చూపుతూ తమ సమస్య పరిష్కరించాలని వినతి పత్రాలు అందజేశారు. బఫర్ సమస్యను పరిష్కరించాలని కోరారు. స్టాకుపాయింట్‌ను పరిశీలించి రేషన్‌బియ్యం పంపిణీలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని వారు హామీ ఇచ్చారు.

రేపటి నుంచి ఉరుసు

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతమానుపల్లి పంచాయతీ అచ్చామియాపల్లిలో శనివారం నుంచి సోమవారం వరకు 433వ ఉరుసు మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు పీఠాధిపతి మహబూబ్‌హుసేన్‌సంజారీ గురువారం తెలిపారు. శనివారం అలాంకుషాయీ, ఆదివారం గంధోత్సవం, రాత్రి 12గంటలకు రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జౌలి అల్లాబక్ష ఇంటి నుంచి గంధం పక్కీర్ల జల్సాలతో ఊరేగింపుగా కొండకమర్ల నుంచి అచ్చామియా దర్గాకు చేరు తుందన్నారు. సోమవారం ఉరుసు ఉంటుందన్నారు. భక్తులకు అన్నదానం, ఖవాలీ, సంస్కృతి కార్యక్రమా లుంటాయన్నారు. 9న క్రైజీబాయ్స్ అనంతపురం వారి ఆర్కెస్ట్రా ఉంటుందన్నారు.

రోడ్డు నియమాలపై అవగాహన



ర్యాలీలో పాల్గొన్న న్యాయాధికారి

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రహదారి మాసోత్సవాల్లో భాగంగా తలుపులలో శ్రీవాణి ఇంగ్లీషు మీడియం పాఠశాల విద్యార్థులు రోడ్డు నియమాలపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ ప్రాం తంలో డ్రైవర్లతో రహదారి భద్రత ప్రతిజ్ఞ చేయించారు. ఇందు లో అనంతపురం స్పెషల్ కోర్టు న్యాయాధికారి కె.శివశంకర్, ఎంవీఐ వరప్రసాద్, ఏ ఎంవీఐ రాజేష్ పాల్గొన్నారు.

టీడీపీ వార్డు మెంబర్ మృతి



దస్తగిరి (ఫైల్)

కొత్తచెరువు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని బైరాపురం గ్రామానికి చెం దిన 3వ బ్లాక్ టీడీపీ వార్డుమెంబర్ బోయ దస్తగిరి(42) గుండెపోటుతో బుధవారం రా త్రి మరణించాడు. వారం క్రితం ఛాతీలో నొప్పి రావడంతో అతన్ని అనంతపురం ప్రభు త్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ అతని కి బుధవారం అర్ధరాత్రి మళ్లీ గుండె పోటు రావడంతో మరణించాడు. దస్తగిరికి భార్య ఆదినారాయణమ్మ, కుమారులు సతీష్ బాబు, హర్షవర్ధన్ ఉన్నా రు. బైరాపురంలో దస్తగిరి మృతదేహానికి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి గురువారం నివాళులర్పించారు.

బ్యాడ్మింటన్ కోర్టు నిర్మాణానికి భూమిపూజ

గాండ్లపెంట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో బ్యా డ్మింటన్ కోర్టు నిర్మాణానికి ఎంఈఓ క్రిష్టానాయక్, ప్రధానోపాధ్యాయులు సిద్ధారెడ్డి గురువారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ ఛైర్మన్ రెడ్డేనాయక్, పీడీలు పాపారాయుడు, హరి, ఉపాధ్యాయులు, కూటమి నాయకులు ఆనంద్, అక్రమ్, సిద్ధారెడ్డి, బావ పాల్గొన్నారు.

పాత నేరస్థులకు కౌన్సెలింగ్

కదిరి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మట్కా, గంజాయి, పేకాట పాతనేరస్థులకు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పట్టణ సీఐ నారాయణరెడ్డి గురువారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎవరైనా నేరాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

న్యూస్ బాక్స్

12, 13 తేదీల్లో పింఛన్ల పునఃపరిశీలన

పరిగి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మంచానికే పరిమితమై రూ.16వేల పింఛన్ పొందుతున్న వారిని పరిశీలించేందుకు జిల్లా వైద్య బృందం మండలానికి రానున్నదని ఎంపీడీఓ శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 12, 13 తేదీల్లో జిల్లా వైద్య బృందం పింఛన్‌దారుల ఇంటివద్దకు వచ్చి పరీక్షలు నిర్వహిస్తుందన్నారు. మండల వ్యాప్తంగా పింఛన్ తీసుకుంటున్న 41 మంది తమ సదరన్ సర్టిఫికెట్‌ను ఆదేరోజు జిల్లా వైద్యులకు చూపించాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన తేదీల్లో ఇంటివద్దే ఉండి వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఎంపీడీఓ సూచించారు.

అవిముక్తేశ్వర స్వామి ఆలయంలో పూజలు


ప్రత్యేక అలంకరణలో శివపార్వతులు

పెనుకొండ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అవిముక్తేశ్వరస్వామి ఆలయంలో గురువారం మాఘమాస పూజలను ఘనంగా నిర్వహించారు. అర్చకులు మూర్తి, కన్నాస్వామి, ఆధ్వర్యంలో ఆలయంలో మూలవిగ్రహాలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. తీర్థప్రసాద వినియోగం గావించారు.

ఈకేవైసీ తప్పనిసరి

సోమందేపల్లి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఆధార్‌కార్డున్న ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలని ఎంపీడీఓ నరేంద్ర కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ సచివాలయం-3లో ఆధార్ ఈకేవైసీ అప్‌డేట్ చేస్తున్నారన్నారు. పిల్లలు, పెద్దలు ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు. ప్రభుత్వ పథకాలకు ఈకేవైసీ తప్పనిసరన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ఆనంద్, ప్రజలు పాల్గొన్నారు.

పీఎల్‌డీ బ్యాంక్ అధ్యక్షుడిగా శేషగిరి ఏకగ్రీవం


పీఎల్‌డీ బ్యాంక్ అధ్యక్షుడు శేషగిరిని అభినందిస్తున్న సభ్యులు

పావగడ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక గ్రామీణ అభివృద్ధి వ్యవసాయ బ్యాంకు అధ్యక్షుడిగా కడమలకుంట గ్రామానికి చెందిన శేషగిరి రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 14మంది డైరెక్టర్లు కలిగి ఉన్న ఈ పీఎల్‌డి బ్యాంక్‌లో 9మంది కాంగ్రెస్ సభ్యులు ఐదుగురు జెడీఎస్ సభ్యులు ఉన్నారు. గురువారం జరిగిన అధ్యక్ష ఎన్నికకు శేషగిరి మాత్రమే నామినేషన్ దాఖలు చేయడంతో అతను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. గతంలో అధ్యక్షునిగా సేవలందించిన శేషగిరి పనితీరు, క్రమశిక్షణను మెచ్చుకుని అభివృద్ధికి సహకరిస్తాడన్న నమ్మకంతో అతన్ని రెండోసారి అధ్యక్షునిగా ఎన్నుకున్నట్లు మాజీ మంత్రి ఎంకటరమణప్ప తెలిపారు. తనపై నమ్మకం ఉంచి అధ్యక్షునిగా ఎన్నుకున్న డైరెక్టర్లకు శేషగిరి కృతజ్ఞతలు తెలిపారు.

నేరేడు చెట్లకు నిప్పు

లేపాక్షి, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): లేపాక్షి గ్రామానికి చెందిన తన పొలంలో 70నేరెడు చెట్లకు బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టినట్లు రైతు నరసింహమూర్తి తెలిపారు. అడవికి దగ్గరగా పొలం ఉండటంతో పశువులవవకాపరులు అడవికి నిప్పుపెట్టి ఉంటారని, దీంతో మంటలు పొలం వరకు వ్యాపించి చెట్లు దగ్ధమైనట్లు గ్రామస్తులు అంటున్నారు. సంబంధిత అధికారులు పరిహారం అందించాలని ఆయన కోరుతున్నారు.

అందుబాటులో గుండెపోటు ఇంజెక్షన్లు

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): అత్యవసరంగా గుండెపోటుకు అందించేందుకు ఇంజెక్షన్‌లు అందుబాటులో ఉన్నాయని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ డా.మోహన్‌నాయక్ పేర్కొన్నారు. స్థానిక ఆసుపత్రిలో గురువారం స్టెమీ గుండెకు భరోసా పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఛాతీ నొప్పి, గుండెదడ, స్పృహకోల్పోవడం తదితర లక్షణాలు ఉంటే గుండెపోటుగా గుర్తించాలన్నారు. మొదట గంటలో రోగిని స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లాలన్నారు. ప్రాథమిక పరీక్షలు నిర్వహించి మొదటి గంటలోనే రూ.45వేలు విలువ చేసే ఈ ఇంజెక్షన్ ఉచితంగా అందిస్తామన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఎయిడ్స్ నివారణ

అమరాపురం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని హేమావతి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జయకుమార్ అన్నారు. అమరాపురం మండల పరిధిలోని కాచికుంట గ్రామంలో బుధవారం హేమావతి పీహెచ్‌సీ సహకారంతో చెయిల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ వారు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జోనల్ సూపర్‌వైజర్ వెంకట్.. హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. అలాగే నిశ్శబ్దాన్ని వీడి ప్రతి ఒక్కరు హెచ్ఐవీ పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఉమాపతి, చంద్రశేఖర్, ఎంఎల్ఎస్‌టీ పవిత్ర, ఫోర్డ్ సంస్థ వారు పాల్గొన్నారు.

దోమ కాటు నివారణపై విద్యార్థుల ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మడకశిర రూరల్ ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దూరం అవుతాయని కల్లుమర్రి పీహెచ్‌సీ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. మండలంలోని బుళ్ళసముద్రంలో గురువారం దోమ కాటుపై విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ మలేరియా,డెంగ్యూ లాంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం పంచియితీ సిబ్బందిచే డ్రైనేజీలు శుభ్రం చేయించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ రాంప్రసాద్, సూపర్‌వైజర్లు శేషాచలం, శశికళ పాల్గొన్నారు.

అద్దె భవనాల్లో అంగన్‌వాడీలు


అజాద్ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో దుస్థితి

● ఎక్కువభాగం కేంద్రాలు రేకుల షెడ్లలోనే..

● రానున్న వేసవిలో పిల్లలకు ఇబ్బందులు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ బడి అంటే అమ్మఒడితో సమానం. పిల్లల ఆలనా పాలన తల్లికంటే ఎవరూ బాగాచూడలేరనేది సత్యం. అలాంటి ఆలనా పాలనా అందించే అంగన్‌వాడీ కేంద్రాల్లో వర్కర్‌లు, ఆయాలు కేంద్రానికి వచ్చే పిల్లలను తమ సొంత పిల్లల్లా చూసుకోవాల్సి ఉంటుంది. ఇదంతా బాగానే ఉన్నా చాల వరకు అంగన్‌వాడీ కేంద్రాలన్నీ అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. అందులోను రేకులషెడ్లలో కూడా కొన్ని కేంద్రాలను నిర్వహిస్తున్నారు. కొన్ని కేంద్రాల్లో ఫ్లోరింగ్ కూడా సరిగా ఉండడంలేదు. మరి కొన్ని కేంద్రాల్లో పిల్లలకు ఆట స్థలం కూడా ఉండడంలేదు. ముఖ్యంగా పిల్లలు పాఠశాలకు వెళ్లేందుకు మొదటి అడుగు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే ఏర్పడుతుంది కాబట్టి వారికి ఆట స్థలం చాల ముఖ్యం. పట్టణాల్లో చాలావరకు ఇరుకు అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. కొన్నిచోట్ల అయితే చాలా ఇరుకైన ప్రాంతాల్లో ఈ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇలాంటి ప్రాంతాల్లో ఆటలు


శిథిలావస్థలో లక్ష్మీపురం అంగన్‌వాడీ కేంద్రం

పాటలు లేక పిల్లలు యాంత్రికంగా తయారయ్యే ప్రమాదం ఉంది. దీంతో మరలా పాఠశాలకు వెళ్ళాలంటే ఇష్టపడరు. చదువంటేనే భయపడతారు. కాబట్టి పిల్లలకు అనుకూలమైన ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంది.

నిబంధనలు గాలికి..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం 500 చదరపు అడుగుల నుంచి 600 చదరపు అడుగులు ఉన్న ఇళ్లను అంగన్‌వాడీలకోసం అద్దెకు తీసుకోవాల్సి ఉంటుంది. అద్దె భవనాల్లో ఆటస్థలం ఉండాలి. లివింగ్‌రూం, వంటగది, కాంపౌండ్‌వాల్ ఉండాలి. అందు కోసం ప్రభుత్వం ప్రతి నెల అద్దె కింద ఒక్కో కేంద్రానికి రూ.6వేలు చెల్లిస్తోంది. అయితే కొంత మంది రెండు, మూడు కేంద్రాలను కూడా ఒకే భవనంలో నిర్వహిస్తూ కేవలం రూ.6వేలు అద్దె చెల్లించి మిగిలిన సొమ్మును పంచుకుంటున్నారని సమాచారం. ఇలాంటి పరిస్థితుల్లో చిన్నారులు ఇరుకైన గదుల్లో ఉండాల్సి వస్తోంది. మరి కొన్ని చోట్ల అసంపూర్తిగా ఉన్న భవనాల్లో కేంద్రాలను నిర్వహిస్తున్నారు.

రానున్నది వేసవి కాలం: రేకుల షెడ్డులో సాధారణంగా వాతావరణం వేడిగా ఉంటుంది. ఇక వేసవి వచ్చిందంటే ఉక్కపోతకు ఉండలేని పరిస్థితి ఉంటుంది. అలాంటిది చిన్న పిల్లలు రోజంతా రేకులషెడ్డులో ఉండాలంటే ఇబ్బందులు తప్పవు. వేసవికి వడదెబ్బ తగిలే పరిస్థితి ఉంటుంది.

హిందూపురం పట్టణ పరిధిలో మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు 294 ఉండగా, మినీ కేంద్రాలు 36 ఉన్నాయి. చాలా వరకు ఇరుకైన అద్దెభవనాలలోనే ఉన్నాయి. అందులో ధర్మపురం 1, 2 సెంటర్‌లు, చౌడేశ్వరీ కాలనీ సెంటర్, శాంతినగర్ హస్నాబాద్, సత్యసాయినగర్, ఇందిరానగర్, పోచనపల్లి తదితర కేంద్రాలు అధ్వాన్న స్థితిలో ఉన్నాయి. ఈ కేంద్రాలను సరైన భవనాల్లోకి మార్చాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అందరికీ అల్టిమేటం జారీ చేశాం



ఇప్పటికే కొన్ని కేంద్రాలను మార్చాలని అల్టిమేటం జారీ చేశాం. ఈ నెలాఖరులోగా కేంద్రాలను అనుకూలమైన చోట్లకు మార్చాలని తెలిపాం. కొంతమంది నిర్లక్ష్యంతో చర్యలు తీసుకోవడంలేదు. తరువాత కూడా అక్కడే కొనసాగిస్తే అద్దె చెల్లించడం ఆపేస్తాం.

శాంతి, సీడీపీఓ

హిజ్రాల మధ్య సరిహద్దు గొడవ

మడకశిరటౌన్, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): గొడవ పడడానికి పెద్ద సమస్య లేమీ అవసరంలేదు. కేవలం 'హిజ్రా దందా' నడపడానికి సరిహద్దు సమస్య ఏర్పడడంతో గురువారం కర్ణాటక, ఆంధ్ర హిజ్రాలు పరస్పరం దాడులకు దిగారు.

మండల పరిధిలోని వై.బి.హళ్లి గ్రామానికి చెందిన రమ్య, దామిని అనే ఇద్దరు హిజ్రాలు గురువారం సంతమార్కెట్ వద్ద ఉన్న సమయంలో కర్ణాటక ప్రాంతం పావగడకు చెందిన ముగ్గురు హిజ్రాలు ఆటోలో వచ్చి 'మా పరిధిలోకి ఎందుకొచ్చారని' వీరిద్దరిపై దాడికి దిగారు. దీంతో మడకశిరకు చెందిన హిజ్రాలు ఎదురుదాడికి దిగారు. గతంలో సైతం తమపై దాడిచేసినా పోలీసులు చర్యలు తీసుకోలేదని ఈప్రాంతానికి చెందిన హిజ్రాలు ధర్నా నిర్వహించారు. అంతటితో ఆగకుండా కన్నడ హిజ్రాలపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై మడకశిర సీఐ రాగిరామయ్య మాట్లాడుతూ, విచారణ జరిపి ఎవరితప్పు ఉంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హిజ్రాలకు హామీ ఇచ్చారు.

విద్యుత్ సరఫరా వేళలు మార్చండి

చిలమత్తూరు, ఫిబ్రవరి6 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మోటార్లకు అందిస్తున్న విద్యుత్ సరఫరా వేళలను మార్చాలని రైతులు ఆందోళన చేపట్టారు. మండల వ్యాప్తంగా బుధవారం రాత్రినుంచి విద్యుత్ శాఖ తీసుకువచ్చిన విద్యుత్ సరఫరా వేళలు ఇబ్బందులు గురిచేసేలా ఉన్నాయని వాటిని మార్చి యధావిధంగా గతంలో ఇస్తున్నట్లుగా విద్యుత్ సరఫరా చేయాలంటూ రైతులు గురువారం దేమకేతేపల్లి సబ్‌స్టేషన్‌వద్ద ఆందోళనచేపట్టారు. ట్రాన్స్‌కో ఏఈ జయవర్ధనరెడ్డి అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడి వారిని శాంతింపజేశారు.

తాగునీటి ఎద్దడిపై దృష్టి పెట్టండి

● పురం మండల మీట్‌లో ప్రజాప్రతినిధుల విజ్ఞప్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రత్నమ్మ

హిందూపురం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): వేసవి సమీపిస్తున్న ప్రస్తుత తరుణంలో పల్లెల్లో తాగునీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉందని, దాని పరిష్కారంపై దృష్టిపెట్టాలని ప్రజాప్రతినిధులు అధికారులను కోరారు. హిందూపురం మండల సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీపీ రత్నమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు మాట్లాడుతూ అధికారులు పల్లెలకు వెళ్లి ఎక్కడ నీటి సమస్య ఉందో గుర్తించి పరిష్కార మార్గాలు వెదకాలన్నారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన వివిధశాఖల అధికారులు, ఆయాశాఖలకు సంబంధించిన అభివృద్ధి పనులు, పథకాలపై వివరించారు.

వైసీపీ ఎంపీటీసీల డుమ్మా


ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఉదయం 11గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం ఎంపీటీసీలు రాకపోవడంతో గంట పాటు వాయిదావేశారు. అయితే కొంతమంది వైసీపీకి చెందిన ఎంపీటీసీలు కార్యాలయానికి వచ్చి సమావేశంలో పాల్గొనకుండా వెళ్లిపోయారు. గంట తరువాత ఆరుగురు ఎంపీటీసీ సభ్యులు రావడంతో సమావేశం నిర్వహించారు. 15మంది ఎంపీటీసీలు ఉండగా సమావేశానికి ఆరుగురు మాత్రమే హాజరయ్యారు. ఇందులో ఎంపీపీ, వైస్ ఎంపీపీ మినహా మిగిలినవారు టీడీపీ సభ్యులే. వైసీపీకి చెందిన ఎంపీటీసీలు సమావేశానికి డుమ్మాకొట్టారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ శివకుమార్, వైస్ ఎంపీపీ రామాంజినేయులు, డిప్యూటీ తహసీల్దార్ మైనుద్దీన్, హౌసింగ్ ఏఈ నారాయణరెడ్డి, తదితరులు హాజరయ్యారు.

రైతుల పొలాలకు దారి ఇస్తాం


రైతులతో మాట్లాడుతున్న శిల్పాకాళేశ్వర్, తహసీల్దార్ శ్రీధర్

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రైతుల వ్యవసాయ పొలాలకు దారి సౌకర్యం కల్పిస్తామని షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ శిల్ప అధికారుల సమక్షంలో తెలిపారు. ఇటీవల షిర్డీసాయి ట్రస్ట్ వారు వ్యవసాయ భూములను ఆక్రమించుకుని పొలాలకు వెళ్లే దారి లేక చుట్టూ ఫెన్సింగ్ వేశారని వెంకటరెడ్డిపల్లి రైతులు ఆందోళన చేసిన విషయం తెలిసిందే. అదే విధంగా వాసుదేవపురంకు చెందిన కొన్న భూములే కాకుండా రాళ్లగుట్టలు, కుంటలు ఆక్రమించుకుని ఫెన్సింగ్ వేసినట్టు రెవెన్యూ అధికారులు సర్వేలో తేల్చారు. ఈ సందర్భంగా పెనుకొండ సమీపంలోని రాంపురం వద్ద సిర్డీ సాయి గ్లోబల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ శిల్ప, తహసీల్దార్ శ్రీధర్‌లు రైతులతో సమావేశం నిర్వహించారు. శిల్ప మాట్లాడుతూ బాధిత రైతుల పొలాలకు వెళ్లేందుకు వేసిన కంచెను తొలగించి దారి ఇస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి సంతాపం


టీడీపీ నాయకుడి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రొద్దం మండలంలోని చెరుకూరు గ్రామంలో టీడీపీ నాయకులు ఉప్పర హనుమప్ప అనారోగ్యంతో గురువారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీ బీకే పార్థసారథి అల్లుడు శశిభూషణ్ పటేల్ గ్రామానికి చేరుకుని హనుమప్ప మృతదేహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట జిల్లా అధికార ప్రతినిధి నరసింహులు, పార్లమెంట్ మహిళ అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ పాల్గొన్నారు.

హిరేతుర్పిలో ముగిసిన ఆంజనేయస్వామి ఉత్సవాలు

గుడిబండ, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని హిరేతుర్పి గ్రామంలో వెలిసిన ఆంజనేయస్వామి ఉత్సవ కార్యక్రమం ఐదు రోజులపాటు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఉట్ల పరుష, ఆంజనేయస్వామి ఊరేగింపు తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆంజనేయస్వామిని ప్రత్యేకంగా పూలతో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు.

ఉపాధి హామీ పనులపై సమీక్ష

అమరాపురం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఏపీడీ లక్ష్మీనారాయణ అధ్యక్షతన వారాంతపు జరిగిన ఉపాధి పనులపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఏపీడీ మాట్లాడుతూ.. అడిగిన ప్రతి కూలీకి ఉపాధి కల్పించాలని ఆయన కోరారు. ప్రతిఉపాధి కూలీకి రూ.300లు తగ్గకుండా పనిచేయించాలని తెలిపారు. పండ్ల తోటల పెంపకం దారులకు ప్రతినెలా బౌండ్రీక్యాప్చర్, చేయాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ జగదీష్, ఏఈ జగదీష్, సాంకేతిక సహాకులు మంజునాథ్, గంగప్ప, హెన్నీ అరుణ్‌కుమార్, లావణ్య పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

పరిగి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): నందమూరి తారక రామారావు విగ్రహ ఏర్పాటుకు మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో గురువారం కూటమి నాయకులు భూమిపూజ చేశారు. ఈసందర్భంగా మండల కన్వీనర్ గోవిందరెడ్డి మాట్లాడుతూ.. బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ అధినేత ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన చేసి భూమిపూజ చేశామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలాజీ, మారుతిప్రసాద్, చౌడప్ప, వడ్డె హనుమయ్య, విష్ణు, డీఎస్ఎల్ శ్రీనివాసులు, పాళ్యంచంద్ర, మహేష్, తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా మధ్వనవమి


రాఘవేంద్రస్వామి మఠంలో హోమాలునిర్వహిస్తున్న దృశ్యం

పెనుకొండ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో గురువారం మధ్వనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం అర్చకులు వాదిరాజు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పండితులు దంపతుల చేత పవమాన హోమం నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. అన్న సంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాలూరి కృష్ణమూర్తితోపాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రైతు సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

అగళి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మడకశిర నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి ఈరలక్కప్ప పేర్కొన్నారు. అగళి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు గురువారం వైసీపీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో లోవోల్టేజి సమస్య కారణంగా మోటార్లు కాలిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అగళి మండలానికి 132కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఎనిమిది డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ సుబ్బారావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు లేని మండలం.. అగళి

అగళి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అగళి మండలం బాల్య వివాహాలు లేని మండలంగా తయారు చేయడానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని మడకశిర సీడీపీఓ నాగమల్లేశ్వరి పేర్కొన్నారు. అగళి మండలం పి. బ్యాడిగెర జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆర్డీటి, మహిళా శిశు అభివృద్ధి సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

రబీ సాగుపై ఏడీఏ సమీక్ష

గోరంట్ల, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలో రబీ పంటల సాగుపై హిందూపురం ఎడిఎ అల్తాఫ్‌అలీఖాన్ గురువారం సమీక్షించారు. రబీ, ఈక్రాప్ బుక్కింగ్‌కు సంబధించి ఈకెవైసీ, త్వరగా పూర్తి చేయాలని, ఎపిఎఫ్ఆర్‌లో రైతుల రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని వెంటనే ప్రారంభించాలన్నారు.

బసవేశ్వర పూజ కోసం కేవీపీఎస్ ధర్నా

రొళ్ల, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రొళ్ల మండలంలోని స్థానిక రెవిన్యూ కార్యాలయం ఎదుట కేవీపీఎస్ నాయకులు గురువారం ధర్నా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి ఎన్.వి.రమణ మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు 105 జీవోను అమలు చేసి దళిత చట్టాలపై అవగాహన కల్పించి ఉంటే ఈరోజు ఈ వివక్ష చూపేవారు కాదన్నారు. ఈవిషయంగా తహసీల్దార్ షేక్షావలికి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం స్టేషన్‌లో వీరాంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. వారు వెంటనే గ్రామానికి వచ్చి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. తహసీల్దార్ షేక్షావలి, ఎంపీడీఓ రామారావు, ఎస్ఐ వీరాంజనేయులు మల్లినమడుగు గ్రామానికి వెళ్లి గ్రామపెద్దలతో మాట్లాడారు. రెండు మూడు రోజుల్లోపు సమస్య పరిష్కారం కాని పక్షంలో జిల్లా కేంద్రంలో పెద్దఎత్తున కుల సంఘాలైన ఎంఆర్‌పీఎస్, బహుచైతన్య వేదిక ఆధ్వర్యంలో కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహిస్తామని దళితులు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


రైతు అంబ్రీష్ మృతదేహం

హిందూపురం, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): పొలానికి నీరు పెట్టడానికి వెళ్లి విద్యుత్‌షాక్‌కు గురై రైతు మృతిచెందిన సంఘటన దేవరపల్లి వద్ద చోటుచేసుకుంది. అప్‌గ్రేడ్ ఎఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల మేరకు దేవరపల్లికి చెందిన అంబ్రీష్(31)గురువారం ఉదయం 9గంటల ప్రాంతంలో తమ పొలంవద్దకు నీళ్లు కట్టడానికి వెళ్లాడు. అయితే మీటరు నుంచి బోరుబావికి వెళ్లే విద్యుత్ వైరు నీటిలో పడి ఉంది. దానిని చూడకుండా తాకడంతో షాక్‌కు గురై కింద పడిపోయాడు. ఉదయం 11గంటల సమయంలో అంబ్రీష్ అన్న నవీన్ పొలంవద్దకు వెళ్లగా, అతను కూడా కరెంటు షాక్‌కు గురయ్యాడు. కానీ అప్రమత్తతతో విద్యుత్ సరఫరాను ఆఫ్ చేసి నవీన్ తన సోదరుడిని పురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చాడు. పరీక్షించిన వైద్యుడు అప్పటికే అతడె మృతిచెందినట్లు తెలిపారు. కాగా మృతుడు అంబ్రీష్‌కు లేపాక్షి మండలం కల్లూరుకు చెందిన గాయిత్రితో తొమ్మిది నెలల క్రితం వివాహమైంది.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం


రంగప్ప మృతదేహం

మడకశిర టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మడకశిర పట్టణం రాజీవ్‌గాంధీ సర్కిల్‌లో గురువారం ఉదయం గుర్తుతెలియని వాహనం ఢీకొని పట్టణంలోని 14వవార్డుకు చెందిన రంగప్ప (55) మృతి చెందాడు. గురువారం ఉదయం పట్టణంలోని రాజీవ్‌గాంధీ సర్కిల్ వద్ద రోడ్డు దాటుతున్న సమయంలో గుర్తుతెలియని వాహనం రంగప్పపై నుంచి దూసుకెళ్లడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి వాహనాన్ని గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి):మండలంలోని తిమ్మాపురం సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురై బెంగళూరులో చికిత్స పొందుతూ గోపాల్(39) మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. ఈనెల 4న వెంకటరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కియా పరిశ్రమ కార్మికుడు గోపాల్ భార్యతో కలిసి ద్విచక్రవాహనంలో విధులకు వెళుతుండగా ప్రమాదవశాత్తు గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇరువురికి గాయాలయ్యాయి. ప్రథమ చికిత్స అనంతరం గోపాల్‌ను బెంగళూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు గొలుసు మెరుగు కేసులో నిందితుడి బైండోవర్


తహసీల్దార్ ఎదుట దీపక్‌కుమార్ సాహూను బైండోవర్ చేసిన దృశ్యం

అగళి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): బంగారు ఆభరణాలకు మెరుగు పెట్టిస్తానని చెప్పి పది గ్రాముల బంగారు చోరీకి పాల్పడిన బీహార్‌కు చెందిన దీపక్‌కుమార్‌సాహూను గురువారం తహసీల్దార్ సుబ్బరావు ఎదుట పోలీసులు బైండోవర్ చేశారు. బుధవారం ఇరిగేపల్లి ప్రెసిడెంట్ మంజునాథ్ భార్య గంగమ్మకు చెందిన 35గ్రాముల బంగారు గొలుసు మెరుగు పెట్టే క్రమంలో పది గ్రాములు దొంగిలించాడు. గొలుసు బరువులో తేడా ఉందని గమనించిన గంగమ్మ జెడ్పీటీసీ ఉమేష్ సాయంతో బంగారు షాపులో తూకం వేసి చూడగా మోసం బయటపడింది. వెంటనే అతడిని పోలీసులకు అప్పగించగా, కేసు నమోదు చేసిన ఎస్ఐ వీరేష్ గురువారం అతడిని తహసీల్దార్ ఎదుట హాజరు పరచారు. లక్ష రూపాయల బాండ్ రాయించుకుని పూచీకత్తుపై అతడిని విడుదల చేశారు. మళ్లీ దొంగతనానికి పాల్పడితే జైలుకు పంపిస్తానని తహసీల్దార్ హెచ్చరించారు.